




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 159 పేజీలు :8 | సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) | ప్రచురణ : శ్రీకాకుళం | ఆదివారం 21 జూన్ 2026 | వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 159 PAGES :8 | EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) | PUBLISHED : SRIKAKULAM | SUN 21 JUNE 2026 | PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur




## చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

- ఉండవల్లిలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబుపై రాందేవ్ ప్రశంసలు
- చంద్రబాబును యోగి, కర్మ యోగిగా అభివర్ణించిన యోగా గురువు
- ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యానికి చంద్రబాబు కృషి చేస్తున్నారని కితాబు
- ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారిందన్న రాందేవ్
- చంద్రబాబులాగే ప్రతీ ముఖ్యమంత్రి పనిచేస్తే దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని వ్యాఖ్య

- మిగతా 2లో



## భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- విశాఖలోని ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను సందర్శించిన పల్లా
- ఆరోగ్య రంగంలో సంస్థ సేవలు ఆదర్శనీయమని ప్రశంస
- ప్రోటిజెనిక్స్ స్ఫూర్తితో స్వదేశంలో పెట్టుబడులు పెట్టాలని పిలుపు
- సంస్థకు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని హామీ

భారత ఆరోగ్య రంగ స్వావలంబనలో ప్రోటిజెనిక్స్ లైఫ్ సైన్సెస్ సంస్థ అందిస్తున్న సేవలు ఆదర్శనీయమని ఏపీ టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రశంసించారు. విదేశాల్లో ఉన్న తెలుగువారు ప్రోటిజెనిక్స్‌ను స్ఫూర్తిగా తీసుకుని స్వరాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం విశాఖలోని జీనోమ్ వ్యాలీలో ఉన్న ప్రోటిజెనిక్స్ ప్లాంట్‌ను ఆయన సందర్శించి, యాజమాన్యంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. "అత్యవసరమైన ప్లాస్మా ఆధారిత ఔషధాల తయారీలో దేశీయ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రోటిజెనిక్స్ చేస్తున్న కృషి అభినందనీయం. ఆరోగ్య రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్య సాధనలో ఇలాంటి సంస్థలే కీలకం" అని పేర్కొన్నారు. ప్లాస్మా ప్రోటీన్ థెరప్యూటిక్స్‌పై దృష్టి సారించిన

- మిగతా 2లో



## ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..

- ఉండవల్లి గుహల వద్ద 'యోగాంధ్ర' కార్యక్రమం
- ముఖ్య అతిథులుగా సీఎం చంద్రబాబు, యోగా గురు రాందేవ్
- చంద్రబాబును కర్మయోగి అంటూ కొనియాడిన రాందేవ్
- మోదీ లక్ష్యాలకు సీఎం సహకారం అద్భుతమన్న యోగా గురు
- ఆసక్తిగా యోగాసనాలను తిలకించిన ముఖ్యమంత్రి

- మిగతా 2లో

# రైతులకు ప్రతి విషయంలో అండగా ఉన్నాం

## అన్నదాత సుఖీభవ: రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు జమ చేసిన సీఎం చంద్రబాబు

- చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్లలో అన్నదాత సుఖీభవ కార్యక్రమంలో పాల్గొన్న సీఎం
- 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లు విడుదల
- తొలి విడతగా ఒక్కో రైతుకు రూ.7 వేల చొప్పున ఆర్థిక సాయం
- కడప, కర్నూలులో వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన
- వ్యవసాయ స్టాళ్లను పరిశీలించి రైతులతో మాట్లాడిన ముఖ్యమంత్రి




పెన్ పవర్ డెస్క్:రాష్ట్రంలోని లక్షలాది మంది రైతులకు ప్రభుత్వం అండగా నిలిచింది. 2026 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ పథకం కింద తొలి విడత ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేశారు. చిలకలూరిపేట నియోజకవర్గం లింగంగుట్ల వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి 46.85 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,125 కోట్లను జమ చేశారు. ఈ సాయంతో ప్రతి రైతు ఖాతాలో తొలి విడతగా రూ.7,000 జమ అయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, అంతకుముందు వ్యవసాయ, ఉద్యానవన శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించారు. రైతులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్లు, వర్మీ కంపోస్టు తయారీ, నూనె గింజల మిషన్ వంటి ప్రదర్శనల గురించి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీఎం కిసాన్ పథకంపై ప్రధాని మోదీ ప్రసంగించిన కార్యక్రమాన్ని రైతులతో కలిసి సీఎం వీక్షించారు.ఇదే వేదిక నుంచి ముఖ్యమంత్రి 'స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా కడప, కర్నూలు జిల్లాల్లో ఏర్పాటు చేయనున్న వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ ప్లాంట్లు 2026 డిసెంబరు నాటికి కార్యకలాపాలు ప్రారంభిస్తాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఇతర నేతలు, అధికారులు పాల్గొన్నారు.



## 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

- అర్ధాంగి భువనేశ్వరికి సీఎం చంద్రబాబు భావోద్వేగ బర్త్‌డే విషెస్
- భార్య, తల్లి, వ్యాపారవేత్తగా ఆమె మా జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడిన సీఎం
- భువనేశ్వరి దయ, కరుణ ఎందరికో ఆదర్శమని ప్రశంస
- నీలాంటి వ్యక్తి జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టమంటూ పోస్ట్

- మిగతా 2లో

## హార్ముజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం - ఇరాన్



అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందంతో పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడుతున్న వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. హార్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ నిరంతరం భీకర దాడులు

- మిగతా 2లో



## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుంటున్నారని విమర్శలు
- ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి దేశం నుంచి పంపిస్తామని స్పష్టీకరణ
- ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడుంటారని ఉద్ఘాటన

శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ ఠాక్రే, కాంగ్రెస్ పార్టీలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భారత్ ధర్మసత్రం కాదని, ఈ దేశం పౌరులకు మాత్రమే ఇక్కడ నివసించే హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. దేశంలోని

- మిగతా 2లో

## రూ.10 లక్షల కోట్ల అప్పు..

### విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

- ఆర్థికవేత్తలు, నిపుణులతో సంప్రదింపుల బృందం ఏర్పాటు చేయాలని ప్రతిపాదన
- రాష్ట్ర అప్పులు రూ.10 లక్షల కోట్లు దాటాయని శ్వేతపత్రంలో వెల్లడి
- 2031 నాటికి పని చేసే వయసు జనాభా తగ్గనుందని, ఇప్పుడే చర్యలు తీసుకోవాలని హెచ్చరిక

- మిగతా 2లో



## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

- కొన్ని రోజులుగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ముద్రగడ
- ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందన్న వైద్యులు
- కుటుంబ సభ్యులకు ఫోన్ చేసిన జగన్
- త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన వైసీపీ అధినేత
- రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చామన్న కుటుంబ సభ్యులు

- మిగతా 2లో



## 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!



- ఇరాన్‌తో ఒప్పందం విషయంలో గందరగోళం
- అమెరికా తరహాలో పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదన్న వాన్స్
- అందుకే ఒప్పంద వివరాలు త్వరగా వెల్లడి కాలేదని వ్యాఖ్య
- ఒప్పందం కుదర్చడం తమ ఘనతగా చెప్పుకొంటున్న పాక్
- వాన్స్ వ్యాఖ్యలతో పాక్‌కు ఇబ్బందికర పరిస్థితి

- మిగతా 2లో

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- 9.44 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 18,880 కోట్లు జమ
- ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం
- పశ్చిమ బెంగాల్‌లోని తారకేశ్వర్ నుంచి నిధుల బదిలీ కార్యక్రమం

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం-కిసాన్) పథకంలో భాగంగా 23వ విడత నిధులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన బటన్ నొక్కి, ఈ నిధులను

- మిగతా 2లో



## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

### హైడ్రా కమిషనర్ రంగనాథ్



- హైడ్రాకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారంటూ రంగనాథ్ ఆగ్రహం
- హైడ్రాను బద్నాం చేసేందుకు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపాటు
- సిటీలో ఇప్పటి వరకు 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని వెల్లడి
- తమకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదన్న రంగనాథ్
- హైడ్రా ఎప్పుడూ మౌనంగా ఉండదని స్పష్టీకరణ

- మిగతా 2లో




## జగన్ కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారా? ఈ ప్రచారంలో నిజమెంత?

వైసీపీ అధినేత వైఎస్ జగన్ కాంగ్రెస్ తో జత కడుతున్నారన్న ప్రచారం ఊపందుకుంది. ఇటీవల మీడియా సమావేశంలో ఆయన చేసిన కాక్రోచ్ వ్యాఖ్యలతో ఆయన కాంగ్రెస్ కు మరింత చేరువయ్యారని, బీజేపీకి దూరమవుతున్నారన్న కక్యాంపెయిన్ సోషల్ మీడియాలో నడుస్తుంది. అంతకు ముందు నుంచే ఈ ప్రచారం జరుగుతుంది. కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని సోషల్ మీడియాలో హోరెత్తిపోతుంది. బెంగళూరులో తన నివాసంలో ఉంటున్న జగన్ డీకే శివకుమార్ తో భేటీ అయ్యారన్న వార్తలు కూడా ఇందుకు అద్దం పడుతున్నాయి.

**కర్ణాటక నుంచి...**

బీజేపీ పై దేశ వ్యాప్తంగా ఎదురవుతున్న వ్యతిరేకతతోనే కాంగ్రెస్ కు దగ్గరవుతున్నారని, అందుకే కర్ణాటక నుంచి వైఎస్ షర్మిలకు రాజ్యసభ స్థానం దక్కకుండా చేయడం వెనక కూడా జగన్ ఉన్నారంటూ మరొక ప్రచారం కూడా జరిగింది. తాజాగా ఏపీలో తాము కాక్రోచ్ లుగా మారుతామని జగన్ చేసిన వ్యాఖ్యలను తీసుకుని ఆయనను హస్తం పార్టీకి దగ్గర చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇందులో నిజానిజాలు పరిశీలిస్తే... జగన్ కాంగ్రెస్ తో జత కట్టడానికి అసలు ఇష్టపడరు. ఎందుకంటే 2012లో పార్టీ పెట్టిన నాటి నుంచి జగన్ కాంగ్రెస్ పార్టీని వ్యతిరేకిస్తూనే వస్తున్నారు. అప్పటి నుంచి జగన్ ఒంటరిగానే పోటీ చేస్తూ వస్తున్నారు. ఇటు బీజేపీ, అటు కాంగ్రెస్ తో కలవకుండానే ఎన్నికల్లో పోటీ చేస్తూ తన పార్టీకి ప్రత్యేక ఓటు బ్యాంకును సంపాదించుకున్నారు.

**ఏపీ రాజకీయాలకే...**

జగన్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలకే పరిమితమవుతారు. ఆయన తెలంగాణ వైపు కూడా చూడరు. అలాంటింది రాష్ట్ర విభజనకు కారణమయిన కాంగ్రెస్ తో ఎందుకు జట్టు కడతారు? అన్న ప్రశ్నకు ప్రచారం చేసే వారి నుంచి సమాధానం ఉండదు. అందులోనూ వైసీపీ ఓటు బ్యాంకు అంతా కాంగ్రెస్ నుంచి వచ్చిందే. మళ్లీ కాంగ్రెస్ తో కలిస్తే తాను రెండు దశాబ్దాలుగా ఏర్పరచుకున్న ఓటు బ్యాంకును తిరిగి కాంగ్రెస్ పార్టీ వైపు మొగ్గు చూపే చేసే చర్యలకు అస్సలు దిగరన్నది రాజకీయ విశ్లేషకుల అంచనా. బీజేపీ ఇప్పుడు కేంద్రంలో బలంగా ఉంది. ప్రాంతీయ పార్టీల విషయంలో కఠిన వైఖరిని అవలంబిస్తుంది. జగన్ బీజేపీకి రహస్య మిత్రుడు. బలమైన బీజేపీని కాదని, కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకునేంత రాంగ్ స్టెప్ ను రాజకీయంగా జగన్ వేయరన్నది కూడా అంతే వాస్తవం. అందుకే జగన్ వచ్చే ఎన్నికల్లోనూ ఒంటిరిగానే పోటీ చేస్తారు. ఒకవేళ ఎన్నికల అనంతరం పొత్తు ఇవ్వాల్సి వస్తే బీజేపీతో చేతులు కలుపుతారు కాని, తనను పధ్నాలుగు నెలల పాటు జైల్లో ఉంచిన కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతివ్వరన్నది వాస్తవం.

## భారత ఆరోగ్య రంగానికి ప్రోటిజెనిక్స్ సేవలు ఆదర్శం

- మొదటి పేజి తరువాయి

ఏపీలోని తొలి సంస్థ ఇదేనని ఆయన గుర్తుచేశారు. 2021లో ఎన్నారై వైద్యుల బృందం స్థాపించిన ఈ సంస్థ.. ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబులిన్ (×ఎ×+), హ్యూమన్ ఆల్బుమిన్, ఫ్యాక్టర్ ఎ××× వంటి కీలక ఉత్పత్తులను అభివృద్ధి చేస్తోంది. రోగనిరోధక లోపాలు, ఆటో ఇమ్యూన్ వ్యాధులు, రక్తస్రావ సమస్యల చికిత్సలో ఈ ఔషధాలు ఎంతో ఉపయోగపడతాయి. ప్రోటిజెనిక్స్ సంస్థను ఆదర్శంగా తీసుకుని ఎన్నారైలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని పల్లా కోరారు. విశాఖతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పరిశ్రమలకు అనుకూల వాతావరణం ఉందని, ప్రజల ఆరోగ్య భద్రతకు తోడ్పడే ఇలాంటి సంస్థలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## చంద్రబాబు ఒక కర్మ యోగి.. ఆయనలా ప్రతీ సీఎం పనిచేయాలి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక యోగి, కర్మ యోగి అని, ఆయనలా దేశంలోని ప్రతి ముఖ్యమంత్రి పనిచేస్తే 'వికసిత్ భారత్' లక్ష్యం 2047 కంటే ముందే సాకారం అవుతుందని యోగా గురువు బాబా రాందేవ్ ప్రశంసించారు. శనివారం ఉండవల్లిలోని ప్రజావేదిక వద్ద 'యోగాంధ్ర' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఎం చంద్రబాబు సైతం ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని, రాందేవ్ బాబా నిర్వహించిన యోగసాధనను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. "సీఎం చంద్రబాబు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు, కానీ నేను యోగా అతిథిగా వచ్చాను. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఆరోగ్యంగా, చురుకుగా ఉండటం స్ఫూర్తిదాయకం. చంద్రబాబు అభివృద్ధి, దార్శనికత కలిగిన ముఖ్యమంత్రి" అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నిర్దేశించిన 'వికసిత్ భారత్', 'ఏక్ భారత్-శ్రేష్ఠ్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు సంపూర్ణ సహకారం అందిస్తున్నారని కొనియాడారు. భారతదేశాన్ని విశ్వగురువుగా నిలిపేందుకు ప్రధాని చేస్తున్న కృషికి చంద్రబాబు తోడుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అమరావతి నిర్మాణంపై కూడా రాందేవ్ బాబా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ప్రజా రాజధాని అమరావతి ఇప్పుడు యోగ రాజధానిగా మారింది. ఈ రాజధానిని పచ్చదనంతో, అద్భుతమైన అందాలతో తీర్చిదిద్దుతున్నారు. ఇక్కడి ప్రకృతి సౌందర్యం స్విట్జర్లాండ్‌ను తలపిస్తోంది" అని కితాబిచ్చారు. అంతకుముందు ఉండవల్లి గుహల్లో కొలువైన పద్మనాభ స్వామిని దర్శించుకున్నానని, ఇక్కడి అరటి, మామిడి పండ్లు చాలా రుచిగా ఉన్నాయని తెలిపారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం అభినందనీయమని అన్నారు. చంద్రబాబు ప్రకృతి ప్రేమికుడు, సాంస్కృతిక ప్రేమికుడు, యోగా ప్రేమికుడు, సర్వజన ప్రేమికుడు అని అభివర్ణించారు.

ఈ కార్యక్రమంలో రాందేవ్ బాబా తన శిష్యులతో కలిసి యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరభ్ కుమార్ ప్రసాద్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 'పాక్‌లో మీడియా స్వేచ్ఛ లేదు'.. కుండబద్ధలు కొట్టిన అమెరికా!

అమెరికా-ఇరాన్ శాంతి ఒప్పందం విషయంలో పాకిస్థాన్‌కు మరోసారి ఇబ్బందికర పరిస్థితి ఎదురైంది. అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యలు ఇస్లామాబాద్‌ను ఇరకాటంలోకి నెట్టాయి. ఒప్పంద వివరాల విడుదల ఆలస్యంపై స్పందించిన ఆయన పాకిస్థాన్‌లో అమెరికా తరహా పత్రికా స్వేచ్ఛ లేదని వ్యాఖ్యానించారు. ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడిన వాన్స్ అమెరికాలో ఒప్పందాల వివరాలు ప్రజలకు అందుబాటులో ఉంచాలనే అంచనాలు ఉంటాయని చెప్పారు. కానీ పాకిస్థాన్, ఖతార్ వ్యవస్థల్లో అలాంటి సంప్రదాయం లేదని వ్యాఖ్యానించారు. అందుకే ఇరాన్‌తో ఒప్పంద వివరాలు విడుదల చేసే విషయంలో కొంత గందరగోళం ఏర్పడిందని తెలిపారు. ఇప్పటికే ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీలో పాకిస్థాన్ 180 దేశాల్లో 153వ స్థానంలో ఉంది. అక్కడ జర్నలిస్టుల స్వేచ్ఛపై అంతర్జాతీయ సంస్థలు గతంలోనూ ఆందోళనలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలో వాన్స్ వ్యాఖ్యలు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మరోవైపు అమెరికా-ఇరాన్ ఒప్పందాన్ని తమ దౌత్య విజయంగా పాకిస్థాన్ ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది. అయితే స్విట్జర్లాండ్‌లో జరగాల్సిన సంతకాల కార్యక్రమం రద్దు కావడం కూడా పాకిస్థాన్‌కు ఇబ్బందిగా మారింది. చివరకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ డిజిటల్ పద్ధతిలో ఒప్పందంపై సంతకాలు చేశారు.

## భారత్ ధర్మసత్రం కాదు: అమిత్ షా వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, వారిని వెళ్లగొడతామని హెచ్చరించారు. శనివారం మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో మహాలక్ష్మి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులను ఓటు బ్యాంకుగా మార్చుకుని రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్, ఉద్ధవ్ ఠాక్రే ప్రయత్నిస్తున్నారని అమిత్ షా ఆరోపించారు. "ఈ దేశం ధర్మసత్రం కాదని వారికి స్పష్టంగా చెప్పదలుచుకున్నాను. ఈ దేశానికి చెందిన వారు మాత్రమే ఇక్కడ ఉంటారు. ప్రతి చొరబాటుదారుడినీ గుర్తించి, దేశం నుంచి తరిమికొడతాం" అని ఆయన పేర్కొన్నారు.

## ముద్రగడ పద్మనాభంకు అస్వస్థత.. హైదరాబాద్‌లో చికిత్స.. ఆరోగ్యంపై జగన్ ఆరా!

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో సుదీర్ఘ అనుభవమున్న సీనియర్ నాయకుడు, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం అస్వస్థతకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలియడంతో ఇరు రాష్ట్రాల్లోని ఆయన అభిమానులు ఆందోళనకు గురయ్యారు.

గత కొన్ని రోజులుగా ముద్రగడ పద్మనాభం కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే ఆరోగ్య సమస్యలు కాస్త ఎక్కువవడంతో కుటుంబ సభ్యులు ఆయనను హైదరాబాద్ తీసుకొచ్చి ఆసుపత్రిలో జాయిన్ చేశారు. గత రెండు రోజులుగా వైద్యులు ఆయనకు డయాలసిస్ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా నిలకడగానే ఉందని, ఆందోళన చెందాల్సిన పనిలేదని చికిత్స అందిస్తున్న డాక్టర్ల టీమ్ అధికారికంగా వెల్లడించింది. ముద్రగడ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న వైసీపీ అధినేత జగన్... ఆయన ఆరోగ్య పరిస్థితిపై ఫోన్ ద్వారా ఆరా తీశారు. ముద్రగడ కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పిన జగన్... ఆయన అత్యంత త్వరగా, సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. మరోవైపు, ముద్రగడ ఆసుపత్రిలో చేరారనే వార్త బయటకు రాగానే సోషల్ మీడియాలో రకరకాల ఊహాగానాలు షురూ అయ్యాయి. దీంతో ఆయన ఆరోగ్యంపై కాపు శ్రేణుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో, ముద్రగడ కుటుంబ సభ్యులు వెంటనే స్పందిస్తూ ఆందోళనలకు చెక్ పెట్టారు. "ఆయన క్షేమంగా ఉన్నారు. కేవలం రెగ్యులర్ కిడ్నీ ట్రీట్‌మెంట్‌లో భాగంగానే ఆసుపత్రికి తీసుకొచ్చాం. దయచేసి ఇంటర్నెట్‌లో వచ్చే ఎలాంటి అవాస్తవాలను, తప్పుడు ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు" అని విజ్ఞప్తి చేశారు.

## రూ.లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం.. మాపై దుష్ప్రచారం ఆపండి

హైదరాబాద్ లో ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న 'హైడ్రా'పై గత కొన్ని రోజులుగా వ్యతిరేక ప్రచారం జరుగుతోందంటూ ఆ సంస్థ కమిషనర్ ఏవీ రంగనాథ్ తీవ్రంగా స్పందించారు. కొందరు పనిగట్టుకుని తమ సంస్థను బద్నాం చేయడానికి దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈరోజు హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన హైడ్రా యాక్షన్ ప్లాన్, ఇప్పటివరకు సాధించిన విజయాలపై పక్కా లెక్కలతో క్లారిటీ ఇచ్చారు

హైడ్రా కేవలం కూల్చివేతలకే పరిమితం కాలేదని, ఇప్పటివరకు సిటీలో దాదాపు 600 ఆపరేషన్స్ పూర్తి చేసి, ఆక్రమణదారుల గుప్పిట్లో ఉన్న సుమారు లక్షా పదివేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, చెరువులను, పార్కులను కాపాడామని రంగనాథ్ వెల్లడించారు. దోపిడీకి గురికాకుండా ఉండాలనే ఆకాంక్షతోనే ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని, ఆ ఆశయాలకు అనుగుణంగానే ప్రభుత్వ ఆస్తులను రక్షిస్తున్నామని చెప్పారు. "రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాకు పూర్తి స్వేచ్ఛను ఇచ్చింది. మాకు రాజకీయ పార్టీలతో సంబంధం లేదు. ఎంఐఎం అయినా, అధికార కాంగ్రెస్ అయినా మాకు ఒకటే. ఫాతిమా కాలేజీ లాంటి విద్యాసంస్థలు భాగ్యనగరంలో చాలా ఉన్నాయి. చట్టం అందరికీ సమానమే. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదు. అలాగని రాత్రికి రాత్రి వచ్చి ఇళ్లను కూల్చేస్తుందనేది అవాస్తవం" అని స్పష్టం చేశారు. గుడిసెలు వేసుకున్న వారిలో నిజమైన పేదలు ఎవరు అనేది పరిశీలిస్తామని, వారికి ప్రభుత్వం తరఫున డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించిన తర్వాతే తదుపరి చర్యలు ఉంటాయని మానవీయ కోణంలో మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఆక్రమణల వల్లే నాలాలు పూడిపోయి ఈ పరిస్థితి వచ్చిందన్నారు. "లక్ష మంది ప్రజలకు మంచి చేయాలన్నప్పుడు.. కొంతమంది ఆక్రమణదారులకు చెడు జరగక తప్పదు. ఒకవేళ హైడ్రా వైపు ఏమైనా తప్పు ఉంటే క్షమాపణ చెప్పడానికి కూడా సిద్ధమే. తప్పులు జరిగితే సరిదిద్దుకుంటూ ముందుకెళతాం. హైడ్రా పొలిటికల్ సెటిల్‌మెంట్లకు అడ్డాగా మాత్రం మారదు" అని తేల్చిచెప్పారు.

## రూ.10 లక్షల కోట్ల అప్పు..
### విజయ్ ప్రభుత్వానికి అన్నామలై కీలక సూచన

తమిళనాడు రాష్ట్రం తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉందని, ఈ విపత్కర పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ఆర్థికవేత్తలు, విద్యావేత్తలు, వివిధ రంగాల నిపుణులతో కూడిన ఒక ఉన్నతస్థాయి సంప్రదింపుల బృందాన్ని ఏర్పాటు చేయాలని 'వుయ్ ది లీడర్' వ్యవస్థాపకుడు కె. అన్నామలై రాష్ట్ర ప్రభుత్వానికి సూచించారు. ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వం ఇటీవలే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేసిన నేపథ్యంలో అన్నామలై ఈ ప్రతిపాదన చేశారు. ప్రభుత్వం జూన్ 16న విడుదల చేసిన శ్వేతపత్రం ప్రకారం, తమిళనాడు ప్రత్యక్ష అప్పులు దాదాపు రూ.10 లక్షల కోట్లకు చేరాయి. ప్రభుత్వ రంగ సంస్థల బకాయిలను కూడా పరిగణనలోకి తీసుకుంటే రాష్ట్రం మొత్తం అప్పు రూ.13.18 లక్షల కోట్లుగా ఉంది. రాష్ట్రానికి వచ్చే మొత్తం ఆదాయంలో 22.8 శాతం కేవలం వడ్డీల చెల్లింపులకే వెచ్చిస్తున్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. గత ఐదేళ్ల కాలంలో జరిగిన ఆర్థిక దుర్వినియోగానికి ఈ శ్వేతపత్రం ఒక 'పోస్ట్‌మార్టమ్' లాంటిదని జూన్ 19న అన్నామలై వ్యాఖ్యానించారు. ఈ నివేదికను కేవలం ఒక సాకుగా చూపి ప్రభుత్వం నిర్లక్ష్యం వహించకూడదని, తక్షణ దిద్దుబాటు చర్యల చేపట్టేందుకు దీనిని ఒక మార్గసూచిగా పరిగణించాలని ఆయన హితవు పలికారు. 2031 నాటికి తమిళనాడులో పనిచేసే వయసున్న జనాభా క్రమంగా తగ్గనుందని, ఇది అత్యంత ఆందోళనకరమైన విషయమని అన్నామలై హెచ్చరించారు. రాష్ట్ర ఆదాయ వనరులను పెంచుకోవడానికి, అప్పుల భారాన్ని తగ్గించుకోవడానికి ప్రభుత్వానికి గడువు చాలా తక్కువగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

## హార్ముజ్‌ను మళ్లీ మూసివేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

చేస్తుండటాన్ని తీవ్రంగా తప్పుబట్టింది. అమెరికా, ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించిన కారణంగా తాజాగా హార్ముజ్ మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఇది తమ ప్రతిస్పందనలో మొదటి అడుగు అని, దురాక్రమణ ఇలాగే కొనసాగితే మరిన్ని చర్యలు ఉంటాయని హెచ్చరించింది. ఈ మేరకు ఇరాన్ సంయుక్త సైనిక విభాగ కేంద్రమైన ఖతమ్-అల్ అన్బియా ప్రకటించినట్లు అక్కడి అధికారిక మీడియా పేర్కొంది. నౌకలు జలసంధి వైపు రావద్దని.. అలా వస్తే వాటి భద్రతకు ముప్పు వాటిల్లుతుందని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ (×=+జ) స్పష్టం చేసింది. ఏదైనా ఒప్పందం అమలు దశలోకి వచ్చినప్పుడు మాత్రమే అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొంది. ఇదే సమయంలో, మధ్యంతర ఒప్పందంపై అమెరికాతో చర్చలు జరిపేందుకు స్విట్జర్లాండ్‌కు

తమ బృందం వెళ్తున్నట్లు ఇరాన్ వెల్లడించింది. మరోవైపు, అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా త్వరలోనే స్విస్‌కు వెళ్లనున్నట్లు సమాచారం. సాంకేతిక అంశాలపై రెండు దేశాలు చర్చలు జరిపేందుకు శుక్రవారమే అక్కడకు వెళ్లాల్సి ఉన్నప్పటికీ.. అది వాయిదా పడిన విషయం తెలిసిందే.

## 'నా జీవిత భాగస్వామిగా దొరకడం నా అదృష్టం'..

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన అర్ధాంగి నారా భువనేశ్వరికి హృదయపూర్వక పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని, ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక భావోద్వేగ సందేశాన్ని పంచుకున్నారు. భువనేశ్వరిని తన జీవితంలో వెలుగుగా అభివర్ణిస్తూ ప్రశంసలు కురిపించారు.

"భార్యగా, తల్లిగా, వ్యాపారవేత్తగా మా అందరి జీవితాల్లో వెలుగు నింపే భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు" అంటూ చంద్రబాబు తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "నీ దయ, కరుణ, సానుకూల దృక్పథం ఎందరికో స్ఫూర్తినిచ్చాయి. నీ ఔదార్యంతో ఇతరులను ఉన్నత స్థానంలో నిలబెడతావు. నువ్వు చేపట్టే ప్రతి పాత్రకు అందాన్ని, ప్రయోజనాన్ని చేకూరుస్తావు" అని కొనియాడారు. "నీలాంటి అద్భుతమైన వ్యక్తి నా జీవిత భాగస్వామిగా లభించడం నా అదృష్టం. నీ బలం, ఆప్యాయత, మరెన్నో విధాలుగా నువ్వు ప్రతిరోజూ మా జీవితాలను ప్రకాశవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ ఏడాది నీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నాను" అని చంద్రబాబు తన పోస్టులో పేర్కొన్నారు. పలువురు ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా భువనేశ్వరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

## పీఎం కిసాన్ 23వ విడత నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ

- మొదటి పేజి తరువాయి

నేరుగా రైతుల ఖాతాల్లోకి బదిలీ చేశారు. ఈ విడత కింద దేశవ్యాప్తంగా 9.44 కోట్లకు పైగా అర్హులైన రైతు కుటుంబాల బ్యాంకు ఖాతాల్లోకి మొత్తం రూ. 18,880 కోట్లకు పైగా నగదు జమ అయింది. 'పీఎం కిసాన్ ఉత్సవ్ దివస్' సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో, ప్రతి లబ్ధిదారునికి రూ. 2,000 చొప్పున ఆర్థిక సాయం అందింది. వ్యవసాయ పనులతో పాటు ఇతర కుటుంబ అవసరాలకు ఈ మొత్తం రైతులకు సకాలంలో అండగా నిలుస్తుందని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. 2019 ఫిబ్రవరిలో ప్రారంభమైన ఈ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులకు ఏటా రూ. 6,000 చొప్పున మూడు విడతల్లో ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. తాజా విడుదలతో కలిపి ఈ పథకం కింద ఇప్పటివరకు రూ. 4.46 లక్షల కోట్లకు పైగా నిధులను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ విడతలో పశ్చిమ బెంగాల్‌లోని 45.35 లక్షల మంది రైతులకు రూ. 907 కోట్లు, గుజరాత్‌లోని 51.28 లక్షల మంది రైతులకు రూ. 1,025 కోట్లు అందాయి. దేశవ్యాప్త లబ్ధిదారులలో 2.18 కోట్లకు పైగా మహిళా రైతులు ఉండటం గమనార్హం. పథకం ప్రయోజనాలను సక్రమంగా పొందేందుకు రైతులు తమ ఈ-కేవైసీ ప్రక్రియను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలని అధికారులు సూచించారు. లబ్ధిదారులు తమ పేరును జాబితాలో తనిఖీ చేసుకునేందుకు జూఎెఅయిఖఅ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లోని 'ఫార్మర్స్ కార్నర్'ను సందర్శించవచ్చు.

## ఉండవల్లిలో 'యోగాంధ్ర' కార్యక్రమం..

యోగా గురు బాబా రాందేవ్ ముఖ్యమంత్రి చంద్రబాబుపై ప్రశంసల వర్షం కురిపించారు. చంద్రబాబు ఒక కర్మయోగి అని అభివర్ణించారు. అమరావతిలోని ఉండవల్లి గుహల వద్ద శనివారం 'యోగాంధ్ర' కార్యక్రమంలో భాగంగా రాందేవ్ యోగాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబా రాందేవ్ మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షలైన 'ఏక్ భారత్, శ్రేష్ఠ్ భారత్', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి లక్ష్యాల సాధనకు చంద్రబాబు అందిస్తున్న సహకారం అమోఘమని కితాబిచ్చారు. ఆయన నాయకత్వ పటిమను కొనియాడారు. అంతకుముందు పతంజలి యోగా గురుకులం విద్యార్థులు ప్రదర్శించిన యోగాసనాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆయన కార్యక్రమాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. రాష్ట్రంలో యోగాకు ప్రాధాన్యత ఇస్తామని, ప్రజల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత అని ఆయన స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, యోగా అభిమానులు పాల్గొన్నారు.

# మంచినీటి కల్పనకు కృషి చేసిన టిడిపి నాయకుడు బాపూజీ



**పాడైన బోరు బావినీ మరమ్మతులు చేపట్టి గ్రామంలో నీటి సరఫరా.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 20.** మండలంలో గల మాకవరం పంచాయతీ, కుంబిరిపడలో త్రాగునీటి వనరుగా ఉన్న బోరుబావినీ మరమ్మతులు చేపట్టి గ్రామంలో నీటి సరఫరా చేసినట్లు టిడిపి నాయకుడు చెండా బాపుజీ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఆయన మాట్లాడుతూ.. 50 కుటుంబాలు నివసిస్తున్నా గ్రామంలో మంచినీటి సరఫరా చేసే బోరు బావి మరమ్మతులకు గురి కావడంతో గ్రామస్తులు నీటి కొరతతో ఇబ్బంది పడ్డారన్నారు. ఈ నేపథ్యంలోనే శనివారం బోరును మరమ్మతులు చేపట్టి గ్రామంలో మంచి నీటిని సరఫరా చేశామన్నారు. బాపూజీ మంచినీటి సమస్య పరిష్కారానికి తీసుకున్న చొరవపట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు ప్రసాద్, హరికృష్ణ, త్రినాథ్, నాగేశ్, సాధురం, సన్యాసిరావు, గాసి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
ఉత్తరాంధ్ర
శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా




# అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన టిడిపి అధ్యక్షురాలు

**పిల్లలకు పౌష్టికాహారాన్ని అందించాలి.**

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 20.** మండల టీడీపీ అధ్యక్షురాలు, మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు గ్రహీత కిల్లో సన్యాసమ్మ సంధ్య స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించారు. అంగన్వాడి పాఠశాలలో అందుతున్న మౌలిక వసతులు, పిల్లలకు అందుతున్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలకు పంపిణీ చేస్తున్న సరుకులు, పౌష్టికాహారాన్ని తనిఖీ చేశారు. పిల్లలకు అందుతున్న విద్యా బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ రహిత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని అంగన్వాడి సిబ్బందికి సూచించారు. అదేవిధంగా అంగన్వాడీలో మంచినీటి, మరుగుదొడ్ల సమస్యలతో పాటు వర్షాకాలంలో భవనం స్లాబ్ నుండి నీరు కారుతుండటం వల్ల పిల్లలు కూర్చోవడానికి ఇబ్బందిగా ఉందని, దీనివల్ల గోడలు తడిచి భవనం శిథిలావస్థకు చేరుకునే ప్రమాదం ఉందని అంగన్వాడీ సిబ్బంది తెలిపారు. ఈ సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కోశాధికారి కిరసాని పద్మనాభం, తెలుగు రైతు అధ్యక్షులు కిముడు ఉర్దాబ్, మాకవరం పంచాయతీ అధ్యక్షులు కోచో కామరాజు, మండల సోషల్ మీడియా కన్వీనర్ చెట్టి నవీన్ కుమార్, కోచో నర్సు, అంగన్వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# వారం రోజుల్లో ఇద్దరు వాలంటీర్ల తో తెరవనున్న జాజుల బంధ పాఠశాల...!





- ఎం ఈ ఓ సింహాచలం వెల్లడి...
- కలెక్టర్ మేడం గారు... మాకు స్కూల్ టీచర్... నేటికీ రాలేదు (పెన్ పవర్) వార్తకు స్పందన...

పెన్ పవర్ EXCLUSIVE ఎఫెక్ట్

**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 20 :** మండలంలోని కొన్నాళ్ళుగా మూతబడి ఉన్న "జాజుల బంధ " ప్రభుత్వ పాఠశాలను వారం రోజుల్లో ఇద్దరు వాలంటీర్ల ను నియమించనున్నట్లు మండల విద్యా శాఖ అధికారి సింహాచలం తెలిపారు. ఈ మేరకు శనివారం ఎం ఈ ఓ సింహాచలం జాజులబంధ గ్రామాన్ని సందర్శించి అక్కడ మూతబడి ఉన్న పాఠశాల పరిస్థితి పై గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 19 వ తేదీన ' కలెక్టర్ మేడం గారు మాకు స్కూల్ టీచర్ నేటికీ రాలేదు అంటూ పెన్ పవర్ లో శీర్షిక ప్రచురితమైన సంగతి తెలిసిందే. ఈ వార్త కు స్పందిన జిల్లా కలెక్టర్ కొయ్యూరు మండల ఎం ఈ ఓ సింహాచలం కు ఆదేశిస్తూ జాజుల బంధ పివిటిజి విద్యారులంతా బడి కావాలి అంటూ ప్రచురితమైన వార్త పై పరిశీలన చేయాలంటూ ఆదేశించారు. దీంతో శనివారం స్థానిక ఎం ఈ ఓ సింహాచలం జాజుల బంధ పివిటిజి గ్రామం సందర్శించి అక్కడ మూతబడి ఉన్న పాఠశాల విద్యార్థులు,తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. గత ఏడాదిలో ఆరు నెలల క్రితం ఈ పాఠశాలను ప్రభుత్వ పాఠశాల మంజూరు చేస్తూ అప్పటి డి ఈ ఓ బ్రహ్మాజీరావు చేతుల మీదుగా ఇక్కడ పాఠశాలను ప్రారంభం చేసి ఒక టీచర్ ను నియమించినట్టు గ్రామ పెద్దలు వెంకటరావు, సామాజిక కార్యకర్త గోవింద్ లు తెలిపారు. నెల రోజుల పాటు టీచర్ వచ్చి ఆ తరువాత రావటం మానేసినట్టు గ్రామస్తులు తెలిపారు. ఈ ఏడాది పాఠశాలల ప్రారంభం అయినా ఎవరూ టీచర్ అనే వారు రాలేదని జాజుల బంధ పివిటిజి విద్యారులంతా తల్లిదండ్రులు తెలిపారు. గ్రామంలో 34మంది పిల్లలు బడికి వెళ్లే వారనీ, వీరు కాక ఈ ఏడాది మరో 6గురు పిల్లలు అంగన్వాడీ సెంటర్ నుంచి ప్రాథమిక పాఠశాలకు వెళ్ళాల్సి ఉందని అయితే వీరు పాఠశాలలో ఎక్కడ చేరాలన్న ఇక్కడ ఉన్న బడి తెరవక పోవటం పై పిర్యాదు చేసినట్టు గ్రామస్తులు తెలిపారు. దీనిపై విచారణ చేసిన ఎం ఈ ఓ సింహాచలం స్పందిస్తూ వారం రోజుల్లో ఇక్కడ ఇద్దరు వాలంటీర్లు ను నియమించి పాఠశాలను తెలిపించి పిల్లలకు విద్యా సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు జాజుల బంధ పివిటిజి గ్రామస్తులు తెలియజేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి



## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి.

- ఎక్సైజ్ ఎస్సై రాంబాబు.
- చింతపల్లి ఐటీఐ కళాశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన సదస్సు.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 20.** యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని చింతపల్లి ఎక్సైజ్ ఎస్సై ఎన్. రాంబాబు పిలుపునిచ్చారు. శనివారం చింతపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రచారం పై ఒక ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేటి యువత ఫ్యాషన్ పేరుతోనో, స్నేహితుల ఒత్తిడి వలనో అలవాటు చేసుకునే వ్యసనాలు వారి జీవితాలను చీకట్లోకి నెట్టేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను, వాటి రవాణా మరియు వినియోగంపై ఉన్న కఠినమైన చట్టాలను విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించారు. చదువుకునే వయసులో లక్ష్యం వైపు అడుగులు వేయాలే తప్ప, ఇలాంటి వ్యసనాల బారిన పడి బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని హితవు పలికారు.

కళాశాల పరిసరాల్లో గానీ, చుట్టుపక్కల ప్రాంతాల్లో గానీ ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయించినా, రవాణా చేసినా వెంటనే ఎక్సైజ్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు అత్యంత గోప్యంగా ఉంచుతామని ఆయన స్పష్టం చేశారు.

ఈ అవగాహన సదస్సులో ఎక్సైజ్ సిబ్బంది, ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## అన్నదాత సుఖీభవ పి ఎం కిసాన్ కింద రూ. 6.80 కోట్లు విడుదల...

- ఏ ఓ శివరామ ప్రసాద్ వెల్లడి.



**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 20:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పి ఎం కిసాన్, అన్నదాత సుఖీభవ నిధుల కింద మండలానికి రూ. 6.80 కోట్ల రూపాయలను విడుదల చేసినట్టు కొయ్యూరు మండల వ్యవసాయాధికారి శివరామ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు చీడిపాలెం రైతు సేవ కేంద్రం లో ఏ ఓ పి. శివరామ ప్రసాద్, గ్రామ వ్యవసాయ సహాయ అధికారి కళ్యాణి పరిమళ తో పాటు రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఎంవివి ప్రసాద్, కూటమి నాయకులు మేడి బోయిన చక్కెర రావు( చిన్నా) తదితరుల ఆధ్వర్యంలో రైతులకు ప్రభుత్వం విడుదల చేసిన నిధుల కేటాయింపు ప్రకటన చేసినట్టు ఏ ఓ శివరామ ప్రసాద్ తెలిపారు. పి ఎం కిసాన్ రూ. 2వేలు, అన్నదాత సుఖీభవ 5 వేలు చొప్పున మొత్తం 7వేల రూపాయలను రైతుల ఖాతాలో జమ చేయనున్నట్టు ఏ ఓ ప్రకటన లో తెలిపారు. మండల పరిధిలో ఉన్న అన్ని రైతు సేవా కేంద్రాల నందు వ్యవసాయ శాఖ ఈ పి ఎం కిసాన్ అన్నదాత సుఖీభవ నిధుల వివరాలను తెలియజేయనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఈ రోజు నేరుగా సి ఎం ప్రసంగాన్ని వీక్షించేలా టీవీలలో , లైవ్ టెలికాస్ట్ ఏర్పాటు చేయగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎంవీవీ ప్రసాద్, కూటమి నాయకులు,కార్యకర్తలు ఈ ప్రత్యేక కార్యక్రమం ను వ్యవసాయ కార్యాలయం వద్ద తిలకించినట్టు ఏ ఓ శివరామ ప్రసాద్ తెలిపారు.

## గ్రామ స్థాయిలోనే గంజాయి,డ్రగ్స్ నిర్మూలన సాధ్యం...

- మంప ఎస్ ఐ శ్రీనివాస్ అవగాహన...




**కొయ్యూరు,పెన్ పవర్ జూన్ 20 :** ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులను పట్టి పీడిస్తూ గంజాయి,డ్రగ్స్ వంటి వాటిపై యువత భవిష్యత్తును పట్టిపీడిస్తూ చిద్రం చేస్తున్న గంజాయి,డ్రగ్స్ మరేదైనా ఇతర మాదక ద్రవ్యాల వాడాకానీకైన , రవాణాకైన గ్రామీణ ప్రాంతాలను వేదికగా మార్చుకోకుండా నిరోధించడంలో స్థానిక ప్రజల పాత్ర కీలకమైన నేపథ్యంలో గిరి ప్రజలు వాటికి దూరంగా ఉండాలని ఎస్ ఐ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని భూధరాళ్ళ పంచాయితీ సాకుల పాలెంలో శనివారం ప్రజలకు గంజాయి, డ్రగ్స్ వ్యతిరేక, నిర్మూలనపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ... గంజాయి, లేదా మరేమైనా మాదక ద్రవ్యాల వాడకానికైన , రవాణా కైనా గ్రామీణ ప్రాంతాలను వేదికగా మార్చుకాకుండా నిరోధించడంలో స్థానిక ప్రజల పాత్ర కీలకమన్నారు. డ్రస్ మహమ్మారిని వేళ్ళతో సహా పెకలించాలంటే సమాజంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా కదలాలని కోరారు. ముఖ్యంగా గ్రామస్తులకు పలు సూచనలు చేశారు. అపరిచిత వ్యక్తులు కదలికలు,గ్రామంలోకి కొత్త వ్యక్తులకు ఎవరైనా అనుమానాస్పదంగా వస్తూ, పోతూ ఉన్నా.. లేదా గంజాయి సాగు, రవాణా వంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. డ్రగ్స్ విక్రయించే వారి గురించి 19720టోల్ ఫ్రీ నెంబర్ కు గానీ పోలీసులకు గానీ ఫోన్ చేసి సమాచారం చెప్పవాల్సిందిగా తెలిపారు. మీరిచ్చిన ఫోన్ సమాచారం ఎట్టి పరిస్థితుల్లో అత్యంత గోప్యంగా ఉంచుతామని ఎస్ ఐ శ్రీనివాస్ భరోసా ఇచ్చారు.

# 1/70 చట్టం రద్దు అయితే...

# గిరిజన సమాజ భవిష్యత్తు ప్రశ్నార్థకమే!

## భూమి, జీవనం, సంస్కృతి పరిరక్షణకు రక్షణ కవచం 1/70 చట్టం

**గూడెం కొత్త వీధి, పెన్ పవర్,జూన్ 20:** గిరిజన ప్రాంతాల్లో గిరిజనుల భూములను రక్షించేందుకు అమలులో ఉన్న 1/70 భూబదలాయింపు వ్యతిరేక చట్టం గిరిజనుల మనుగడకు కీలకమైన రక్షణ కవచంగా నిలుస్తోంది. ఈ చట్టం బలహీనపడినా లేదా రద్దయినా గిరిజన సమాజం సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో తీవ్ర పరిణామాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని గిరిజన హక్కుల పరిరక్షకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భూములపై గిరిజనేతరుల ఆధిపత్యం:**
చట్టం లేకుంటే ఆర్థికంగా బలమైన గిరిజనేతరులు గిరిజన భూములను సులభంగా స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుంది. దీంతో తరతరాలుగా సాగుచేసుకుంటూ జీవిస్తున్న గిరిజన కుటుంబాలు తమ సొంత భూముల నుంచే నిర్వాసితులై, అదే ప్రాంతాల్లో కూలీలుగా మారే పరిస్థితులు ఏర్పడవచ్చు.

**విద్య, ఉపాధిపై ప్రభావం:**
భూమిని కోల్పోయిన కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిని పిల్లల చదువులు మధ్యలోనే నిలిచిపోయే ప్రమాదం ఉంది. విద్యా అవకాశాలు తగ్గిపోవడంతో భవిష్యత్ తరాలు మరింత వెనుకబడిపోయే అవకాశం ఉంది. ఉపాధి, ఆదాయ వనరులు తగ్గిపోవడం వల్ల పేదరికం మరింత పెరిగే పరిస్థితి ఏర్పడుతుంది.

**ఆరోగ్యం, ఆహార భద్రతకు ముప్పు:**
గిరిజనుల జీవనాధారం భూమి, అడవి వనరులే. భూములను కోల్పోతే ఆహార భద్రత దెబ్బతినడంతో పాటు ఆరోగ్య సమస్యలు కూడా పెరిగే అవకాశం ఉంది. జీవన ప్రమాణాలు క్షీణించి సామాజిక అసమానతలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

**సంస్కృతి, అస్తిత్వానికి ప్రమాదం:**
గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు భూమి, అడవులతో ముడిపడి ఉంటాయి. భూములు కోల్పోతే వారి సాంప్రదాయ జీవన విధానం క్రమంగా కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. ఫలితంగా గిరిజనుల ప్రత్యేక గుర్తింపు, అస్తిత్వం సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

**స్వయం ప్రతిపత్తిపై ప్రభావం:**
గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరుల ఆధిపత్యం పెరిగితే గ్రామాల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది. స్థానిక ప్రజల నిర్ణయాధికారం తగ్గిపోతుంది. భవిష్యత్తులో గిరిజనులు తమ సొంత ప్రాంతాల్లోనే మైనారిటీలుగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

**రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిదీ:**
1/70 చట్టం కేవలం భూములను కాపాడే చట్టం మాత్రమే కాదు. గిరిజనుల జీవనాధారం, విద్య, ఆరోగ్యం, సంస్కృతి, ఆత్మగౌరవం, భవిష్యత్ తరాల మనుగడను రక్షించే కీలక చట్టం. అందువల్ల ఈ చట్టాన్ని పరిరక్షించడం అంటే గిరిజన సమాజ భవిష్యత్తును పరిరక్షించడమే.
"భూమి ఉంటేనే గిరిజనుడు ఉంటాడు... గిరిజనుడు ఉంటేనే గిరిజన సంస్కృతి, అస్తిత్వం నిలుస్తాయి."అందుకే 1/70 భూబదలాయింపు వ్యతిరేక చట్ట పరిరక్షణ కోసం ప్రతి ఆదివాసీ, ప్రతి గిరిజన హక్కుల పరిరక్షకుడు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# పేసా చట్టం... గిరిజన స్వయం పాలనకు రాజ్యాంగ రక్షణ

## గ్రామసభకు అధికారం... గిరిజనుల హక్కులకు భరోసా

**స్టాఫ్ రిపోర్టర్.గూడెం కొత్త వీధి, జూన్ 20:** దేశంలోని గిరిజనుల హక్కుల పరిరక్షణ, వారి సంస్కృతి, సంప్రదాయాల సంరక్షణ, సహజ వనరులపై నియంత్రణ కల్పించేందుకు రూపొందించిన అత్యంత కీలకమైన చట్టాలలో పేసా చట్టం ఒకటి. షెడ్యూల్డ్ ప్రాంతాలలో నివసించే గిరిజనులకు స్వయం పాలన హక్కును కల్పించడమే ఈ చట్టం ప్రధాన లక్ష్యం. భారత రాజ్యాంగంలోని 73వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామీణ స్థానిక సంస్థలకు అధికారాలు కల్పించినప్పటికీ, గిరిజన ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని 1996లో పంచాయతీరాజ్ వ్యవస్థను షెడ్యూల్డ్ ప్రాంతాలకు విస్తరించే చట్టాన్ని రూపొందించారు. దీనినే పేసా చట్టంగా పిలుస్తారు.

**గ్రామసభే సర్వోన్నత అధికారం:**
పేసా చట్టం ప్రకారం గ్రామసభకు అత్యున్నత స్థానం కల్పించారు. గ్రామాభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, భూముల పరిరక్షణ, సహజ వనరుల వినియోగం, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై గ్రామసభ నిర్ణయాలకు ప్రాధాన్యత ఉంటుంది. గ్రామ ప్రజలే తమ గ్రామ భవిష్యత్తును నిర్ణయించుకునే అవకాశాన్ని ఈ చట్టం కల్పిస్తుంది.

**జల-జంగల్-జమీన్‌పై హక్కు:**
నీరు, అడవి, భూమి గిరిజనుల జీవనాధారాలు. ఈ సహజ వనరుల వినియోగంలో గ్రామసభ అభిప్రాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని పేసా చట్టం స్పష్టం చేస్తుంది. గిరిజన ప్రాంతాల్లో చేపట్టే అభివృద్ధి పనులు స్థానిక ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీయకుండా ఉండేందుకు ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది.

**భూముల రక్షణకు అండ:**
గిరిజనుల భూముల బదిలీలు, ఆక్రమణలు, అక్రమ లావాదేవీలను అరికట్టడంలో పేసా చట్టం కీలక పాత్ర పోషిస్తుంది. గిరిజనుల భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లకుండా గ్రామసభ పర్యవేక్షణ ఉండాలని ఈ చట్టం పేర్కొంటుంది.

**సంప్రదాయాలకు గుర్తింపు:**
గిరిజన సమాజాల్లో తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయ పాలనా వ్యవస్థలు, ఆచారాలు, సామాజిక నియమాలకు ఈ చట్టం గుర్తింపు కల్పించింది. తద్వారా వారి ప్రత్యేక సంస్కృతి, జీవన విధానం, అస్తిత్వాన్ని కాపాడే అవకాశం ఏర్పడింది.

**అమలులో ఎదురవుతున్న సమస్యలు:**
చట్టం అమలులో ఉన్నప్పటికీ అనేక ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్న విమర్శలు ఉన్నాయి. గ్రామసభల నిర్ణయాలను పరిగణనలోకి తీసుకోకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం, చట్టంపై ప్రజలకు సరైన అవగాహన లేకపోవడం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వంటి సమస్యలు కొనసాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో గ్రామసభలు కేవలం నామమాత్రంగా నిర్వహించబడుతున్నాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

**పేసా ఎందుకు అవసరం?**
పేసా చట్టం కేవలం పరిపాలనా చట్టం మాత్రమే కాదు. ఇది గిరిజనుల భూమి, అడవి, నీరు, సంస్కృతి, సంప్రదాయాలు, స్వయం నిర్ణయాధికారాన్ని కాపాడే రాజ్యాంగబద్ధమైన రక్షణ. ఈ చట్టం సమర్థంగా అమలైతే గిరిజన ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుంది. స్థానిక ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమవుతుంది.

**నేటి అవసరం:**
గిరిజన ప్రాంతాల్లో పేసా చట్టంపై విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రామసభలను బలోపేతం చేయడం, చట్టంలోని అధికారాలను ప్రజలకు తెలియజేయడం, ప్రభుత్వ యంత్రాంగం చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడం ద్వారా మాత్రమే పేసా లక్ష్యాలు నెరవేరుతాయి."గ్రామసభ బలంగా ఉంటేనే గిరిజన స్వయం పాలన బలపడుతుంది. పేసా అమలైతేనే గిరిజన హక్కులు పరిరక్షించబడతాయి."

# జెర్రెల పీహెచ్‌సీకి అంబులెన్స్ కేటాయించాలి




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,జూన్ 20:** జెర్రెల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (పీహెచ్‌సీ) తక్షణమే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని జెర్రెల గ్రామపంచాయతీ జనసేన పార్టీ అధ్యక్షుడు చిక్కుడు అశోక్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో జెర్రెల పీహెచ్‌సీకి చెందిన అంబులెన్స్ మరమ్మతులకు వెళ్లి ఇప్పటికీ తిరిగి రాలేదని తెలిపారు. అనంతరం ఐటీడీఏ అధికారులు తాత్కాలికంగా మరో అంబులెన్స్‌ను అందించినప్పటికీ అది కూడా శిథిలావస్థలో ఉండేదని పేర్కొన్నారు. ఈ అంబులెన్స్ ద్వారా రోగులను చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా ఈ ఏడాది మార్చి 13న బ్రేకులు విఫలమై ప్రమాదానికి గురైందని, డ్రైవర్‌తో పాటు ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారని వివరించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు జెర్రెల పీహెచ్‌సీకి కొత్త అంబులెన్స్‌ను కేటాయించలేదని ఆరోపించారు. దీంతో మొండిగడ్డ, వంచుల,అమ్మవారి దారకొండ, జెర్రెల గ్రామపంచాయతీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, అత్యవసర వైద్య సేవలు అవసరమైన రోగులను ఆసుపత్రులకు తరలించడంలో సమస్యలు ఎదురవుతున్నాయని చెప్పారు. జిల్లా కలెక్టర్, వైద్యశాఖ అధికారులు స్పందించి జెర్రెల పీహెచ్‌సీకి వెంటనే అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని అశోక్ విజ్ఞప్తి చేశారు.

# 13 వ వార్డులో స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర

**విశాఖ తూర్పు,పెన్ పవర్ జూన్ 20:** జివీఎంసీ13 వ వార్డు లక్ష్మీ నగర్ సచివాలయం-5 పరిధిలో నిర్వహించిన స్వర్ణాంధ్ర -- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు వార్డు మాజీ కార్పొరేటర్ కెల్లా సునీత సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ వార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం,చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా జాగ్రత్తలు తీసుకోవడం,పచ్చదనాన్ని పెంపొందించడం, పరిశుభ్రమైన వార్డు నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.
"పరిశుభ్రమైన వార్డు -- ఆరోగ్యకరమైన సమాజం" అనే లక్ష్యంతో ప్రతి పౌరుడు స్వచ్ఛత కార్యక్రమాల్లో భాగస్వామి కావాలని కోరారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులను శాలువా పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వరరావు సచివాలయం శానిటేషన్ సెక్రటరీలు,మహిళా అధ్యక్షురాలు మజ్జి రమణి, యువత అధ్యక్షులు వడిసెల శ్రీను,బూత్ కన్వీనర్ పండ కృష్ణ ఆర్పీలు,స్థానిక మహిళలు తదితరులు పాల్గొన్నారు




# బాక్సైట్ జోలికొస్తే గిరిజన ఆయుధాలతో తిరుగుబాటు చేస్తాం

- తవ్వకాలను అడ్డుకునేందుకు ప్రాణత్యాగానికైనా సిద్ధం
- జర్రెలలో పర్యటించిన ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 20:**గిరిజన ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాల కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తే గిరిజనులు తమ సాంప్రదాయ ఆయుధాలతో ప్రతిఘటిస్తారని, అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుకాడబోమని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. జీకేవీధి మండలం జర్రెల గ్రామంలో ఇటీవల బాక్సైట్ నమూనాల సేకరణకు వచ్చిన వ్యక్తులను గ్రామస్తులు అడ్డుకున్న నేపథ్యంలో ఆయన గ్రామంలో పర్యటించి గిరిజనులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రహస్యంగా బాక్సైట్ తవ్వకాల కోసం ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. జర్రెల కొండ ప్రాంతంలో మట్టి నమూనాలు సేకరిస్తున్న వ్యక్తులను గ్రామస్తులు అడ్డుకొని పోలీసులకు అప్పగించినప్పటికీ, వారు ఎవరు, ఏ శాఖకు చెందినవారు, ఏ ఉద్దేశంతో వచ్చారనే విషయాన్ని అధికారులు ఇప్పటివరకు వెల్లడించలేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే జీవో నెం. 97ను రద్దు చేసి గిరిజన ప్రాంతాల్లో బాక్సైట్ తవ్వకాలను నిషేధించారని గుర్తు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గిరిజన ప్రాంతాల ఖనిజ సంపదపై దృష్టి సారించిందని విమర్శించారు. గిరిజనుల జీవనాధారమైన అడవులు, కొండలు, భూముల జోలికి వస్తే తీవ్రస్థాయిలో ఉద్యమిస్తామని హెచ్చరించారు. గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలతో కలిసి త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించి ప్రభుత్వ వైఖరిని ప్రజల ముందుంచుతామన్నారు. గిరిజన ప్రాంతాల ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలను వైఎస్సార్సీపీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం ఎంతవరకైనా పోరాడుతామని విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీపీ బోయిన కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు కంకిపాటి గిరి ప్రసాద్, రాష్ట్ర పంచాయతీరాజ్ విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, చింతపల్లి ఎంపీపీ కొర్రాబు అనూషదేవి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి భూసారి కృష్ణారావు, జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు సాగిన గంగన్న పడాల్, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పాంగి గణబాబు, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు లోచలి వరప్రసాద్, రైతు విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు పనసల రాజేష్, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు లమ్మసింగి రమేష్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు కంకిపాటి నారాయణ, జిల్లా కోశాధికారి కుందరి రామకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి వంతల చంటిబాబు, వంతల అరుణ్‌కుమార్, యువజన విభాగం అధ్యక్షుడు కోర్ర బాబి, రీమల బాలకృష్ణ, ఉపాధ్యక్షుడు కరణం గోపాలకృష్ణ, సాగిన సింహాచలం, మాజీ జెడ్పీటీసీ మచ్చల మత్స్యరాజు, సిరి బాలరామారావు, కంకిపాటి శ్రీరాములు, ముువ్వల చిన్నబ్బాయి, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## పేద వారికి రొట్టె,పళ్ళు పంపిణి



**గాజువాక : పెన్ పవర్, జూన్ 20**
జీవీఎంసీ 87 వార్డు ఐటీడీపి అధ్యక్షుడు గోకాడ భాస్కర్ కణితి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో వృద్ధులు కి, ఆసుపత్రి కి వైద్యం కోసం వచ్చిన వారికి పళ్ళు, రొట్టెలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ కార్యకర్త గా ప్రజల కి సేవ చేస్తూ ఉండటం ఆనందం గా ఉందని అన్నారు. ఈ కార్యక్రమం లో టీడీపీ సీనియర్ నాయకులు డీవీ అప్పారావు,బి. రాజన్ రాజు, మాటూరి రాము, కర్రి కృష్ణ, సంద్రన రాజేష్, బోండా అఖిల్, గణేష్, నాగరాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 87 వార్డ్ పరిధిలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

- ముఖ్య అతిథిగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు




**కూర్మన్నపాలెం: పెన్ పవర్, జూన్ 20**
మహా విశాఖ నగరపాలక సంస్థ 87వ వార్డు పరిధి గణేష్ నగర్ ఘనంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక నియోజకవర్గం శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావు ,జిల్లా కలెక్టర్ ముత్తింబాక అభిషిక్త్ కిశోర్ ఐఏఎస్ , జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఐఏఎస్, మాజీ రాష్ట్ర కార్యదర్శి మజ్జి కార్పొరేటర్ బోండా జగన్నాథం జగన్ జీవీఎంసీ నల్లనయ్య. సీ ఎం హెచ్వో ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పరిశుభ్రంగా, పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమమే స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ఇందులో భాగంగా ప్రతి నెలా మూడో శనివారం రాష్ట్రవ్యాప్తంగా సామూహిక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మన పరిసరాలను శుభ్రపరుచుకోవాలని, మన ఇంట్లో చెత్తను ప్రతిరోజు వస్తున్న చెత్త బండికి అందజేయాలని, చెత్తను సక్రమంగా సేకరించి, పునర్వినియోగం చేయడంపై ప్రజలకు అవగాహన కల్పించారు . ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్, సింహాద్రి.ఏ ఎం హెచ్ ఓ, కిరణ్ కుమార్.స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్, 87వ వార్డు సానిటరీ ఇన్స్పెక్టర్ అనిల్.వార్డ్ అధ్యక్షుడు విజయరామరాజు, సెక్రెటరీ బొట్టా ప్రకాష్, బెల్లంకొండ రాజన్ రాజు , జాన్ రమేష్, కణితి ఈశ్వరరావు, ఆనంద్ కుమార్, కడుపుట్ల శ్రీను, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## విజ్ఞాన్ దువ్వాడలో అమెరికాలో ఉన్నత విద్య అవకాశాలపై ఇంటరాక్టివ్ సెషన్




**కూర్మన్నపాలెం: పెన్ పవర్ ,జూన్ 20:**దువ్వాడలోని విజ్ఞాన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అటానమస్ లో అమెరికాలో ఉన్నత విద్య అవకాశాలపై ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్‌ను స్టడీట్రెక్ ప్రైవేట్ లిమిటెడ్ ఓవర్సీస్ ఎడ్యుకేషన్ అండ్ కెరీర్ సర్వీసెస్ సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అమెరికాలోని న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్ హైట్స్‌లో ఉన్న సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ ప్రతినిధుల బృందం పాల్గొని విద్యార్థులకు ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలపై అవగాహన కల్పించారు.

ఈ ప్రతినిధుల బృందంలో సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ అకాడమిక్ అఫైర్స్ డాక్టర్ గేల్ గిబ్సన్ గేలే, వైస్ ప్రెసిడెంట్ అకాడమిక్ అఫైర్స్ డాక్టర్ జాన్ ఎడ్వర్డ్స్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ గ్రాడ్యుయేట్ ఎడ్యుకేషన్ మిస్టర్ కోర్ట్నీ ఇన్నిస్, అసిస్టెంట్ డీన్ అండర్ గ్రాడ్యుయేట్ ఎడ్యుకేషన్ డాక్టర్ లావినియా చియుంగు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గ్రాడ్యుయేట్ ఇంటర్నేషనల్ స్టూడెంట్ సర్వీసెస్ నకేషా డేవిస్, టిబిఎస్ హెడ్ ఆఫ్ పార్ట్నర్‌షిప్ విశ్వనాథ్, స్టడీట్రెక్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రవి గుణుపూరు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రతినిధులు అమెరికా ఉన్నత విద్యా వ్యవస్థ, అకాడమిక్ ప్రమాణాలు, భారతీయ విద్యార్థులకు అందుబాటులో ఉన్న విద్యా అవకాశాలు, గ్లోబల్ కెరీర్ అవకాశాల గురించి విద్యార్థులకు సమగ్ర సమాచారం అందించారు.


సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్‌లో అందుబాటులో ఉన్న బిజినెస్ అనలిటిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్, మేనేజ్‌మెంట్, పబ్లిక్ హెల్త్ తదితర స్టెమ్ కోర్సులపై ప్రత్యేకంగా వివరించారు. అడ్మిషన్ విధానం, అర్హత ప్రమాణాలు, స్కాలర్‌షిప్‌లు, ఆర్థిక సహాయం, ఇంటర్న్‌షిప్‌లు, క్యాంపస్ జీవితం, విద్యార్థి సహాయ సేవలు మరియు భవిష్యత్ కెరీర్ అవకాశాలపై సమగ్ర అవగాహన కల్పించారు.

కార్యక్రమంలో నిర్వహించిన ప్రశ్నోత్తరాల సెషన్‌లో విద్యార్థులు అడ్మిషన్‌లు, వీసా ప్రక్రియలు, స్కాలర్‌షిప్‌లు, పరిశోధన అవకాశాలు, ఇంటర్న్‌షిప్‌లు మరియు ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన స్పాట్ ప్రొఫైల్ ఎవాల్యుయేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇందులో ఆసక్తి గల విద్యార్థులకు వారి విద్యార్హతలు, అకాడమిక్ ప్రొఫైల్ ఆధారంగా వ్యక్తిగతంగా మార్గనిర్దేశం చేసి, వారికి అనుకూలమైన అండర్ గ్రాడ్యుయేట్ మరియు పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల ఎంపికపై సలహాలు అందించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. సుధాకర్, రెక్టర్ డాక్టర్ వి. మధుసూదనరావు మరియు హెడ్ -- ఐఐసీ ఒ ఏఈ డాక్టర్ ఎస్.ఎం. మురళీకృష్ణ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులకు అంతర్జాతీయ విద్యా అవకాశాలు కల్పించేందుకు, విదేశీ విశ్వవిద్యాలయాలతో విద్యా సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు విజ్ఞాన్ కట్టుబడి ఉందని తెలిపారు.

## బురదలో ఆగిన అంబులెన్స్.. డోలీ మోతతో 5 కి.మీ మృతదేహం తరలింపు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, జూన్ 20:**అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం ఏ.దారకొండ పంచాయతీకి చెందిన ముర్ల ఎర్రయ్య గురువారం చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఆసుపత్రి నుంచి అంబులెన్స్ ఏర్పాటు చేసినప్పటికీ, ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చామగెడ్డ వద్ద కొత్తగా నిర్మాణంలో ఉన్న వంతెనపై మట్టి, బురద పేరుకుపోవడంతో అంబులెన్స్ ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో సాయంత్రం 7 గంటల సమయంలో వంతెన వద్దనే మృతదేహాన్ని దించి అంబులెన్స్ వెనుదిరిగింది. అనంతరం గొల్లపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతూ, డోలీ మోత కట్టి సుమారు 5 కిలోమీటర్ల దూరం మృతదేహాన్ని మోసుకెళ్లారు. మార్గమధ్యంలో పెద్ద కాలువను దాటుకుంటూ ఎంతో కష్టపడి గ్రామానికి చేర్చారు. ఈ ఘటనతో గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని, అత్యవసర సమయాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. కాబట్టి ఏ.దారకొండ పంచాయతీ పరిధిలోని చామగెడ్డ వద్ద శాశ్వత వంతెన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయడంతో పాటు, గ్రామానికి బీటీ రోడ్డు మంజూరు చేసి ప్రజల కష్టాలను తీర్చాలని కూటమి ప్రభుత్వాన్ని గ్రామస్తులు చేతులు జోడించి వేడుకుంటున్నారు.

## 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' పోస్టర్ ఆవిష్కరణ




**అరకులోయ పెన్ పవర్ జూన్ : 20,** పర్యాటక ప్రాంతమైన అరకు వ్యాలీని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు జిల్లా యంత్రాంగం నడుం బిగించింది. 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా, "ప్లాస్టిక్ ఫ్రీ అరకువాలీ" ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ నిషాంతి. టి పాల్గొని, దీనికి సంబంధించిన ప్రత్యేక గోడ పత్రికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అరకు వ్యాలీ అందాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పర్యాటకులు, స్థానిక వ్యాపారస్తులు ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని పిలుపునిచ్చారు.

కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశాలు
ప్లాస్టిక్ వాడటం వల్ల సమతుల్యత వాతావరణం దెబ్బతింటుందని, అందుకు
ప్లాస్టిక్ రహిత పర్యాటకం, అరకు వచ్చే పర్యాటకులలో ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించడం.
స్వచ్ఛతకు ప్రాధాన్యత, 'స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' లక్ష్యాలను సాధించడంలో భాగంగా పారిశుధ్యాన్ని మెరుగుపరచడం.
స్థానికుల భాగస్వామ్యం, హోటళ్లు, దుకాణాల యజమానులను పర్యావరణ హిత ప్రత్యామ్నాయంగా (జూట్ బ్యాగులు, కాగితపు సంచులు) వైపు ప్రోత్సహించడం వంటి వస్తు సామగ్రి వైపు వాడుకునే అవగాహన కల్పించాలని స్వచ్ఛంద సంస్థలకు, ప్రజా ప్రతినిధులకు ఈ సందర్భంగా కలెక్టర్ కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటీడీ ప్రాజెక్ట్ అధికారి ఆదిత్య వర్మ, పాడేరు మాజీ శాసన సభ్యురాలు గిడ్డి ఈశ్వరి, స్థానిక అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, పర్యాటక శాఖ సిబ్బంది, ప్రజలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా సాయిబాబా ఆలయ16 వ వార్షికోత్సవం



**విశాఖ తూర్పు,పెన్ పవర్,20:**తూర్పు నియోజకవర్గం 12వ వార్డు లీలా సుందరయ్య నగర్ లో వెలసియున్న శ్రీ శ్రీ విఘ్నేశ్వర, అభయాంజనేయ, దత్తాత్రేయ సహిత శిరిడి సాయి దేవాలయం యొక్క 16 వ వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలతో పాటు శ్రీలక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. శనివారం నిర్వహించిన మహా అన్న సమారాధన కార్యక్రమానికి సమీప ప్రాంత ప్రజలు భారీగా తరలివచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విశాఖ తూర్పు నియోజకవర్గ టిడిపి యువ నాయకులు వెలగపూడి ప్రతాపరుద్ర పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో12 వ వార్డు టిడిపి అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజు,13 వ వార్డు టిడిపి అధ్యక్షులు మరియు లీలా సుందరయ్య నగర్ గ్రామ అధ్యక్షులు ఏడువాక సన్యాసిరావు,శ్రీమహాలక్ష్మి,, ,బండారు శంకర్రావు,ఎన్ అవతారం, కర్రి కృష్ణ, బండారుసన్యాసిరావు,వేమలి ఈశ్వర్రావు,పందిరి నర్సింగ్, రావి శ్రీను,పాసిలి సన్యాసినాయుడు,కొత్తలి పేరినాయుడు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. మూడు రోజులు పాటు నిర్వహించిన కార్యక్రమాలకు సహకరించిన గ్రామ ప్రజలకు పెద్దలకు సంఘ సభ్యులకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలియజేశారు. సాయంత్రం జరిగిన తిరివీధి కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## పాడేరులో యువతకు జాబ్ మేళా...!

ఎంపీడీవో "జెడివి ప్రసాద్" వెల్లడి




**కొయ్యూరు, పెన్ పవర్ జూన్ 20:** అల్లూరి జిల్లా పాడేరు గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 24న యువతకు వివిధ కంపెనీల్లో జాయిన్ అయ్యేందుకు జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని మండల అభివృద్ధి అధికారి జెడివి ప్రసాద్ తెలిపారు. ఈ జాబ్ మేళా ఇంటర్వ్యూలో పాల్గొనే యువతీ యువకులుహ్ట్ర్జూం;//ఝఉజూబఅఝ ఎ.ఖజూ.స్త్రశీజ.అఅ వెబ్సైట్లో లాగిన్ అయి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. లాగిన్ అయి అడ్మిట్ కార్డుతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆయన తెలియజేశారు.

## అంగన్వాడీ కేంద్రాల పనితీరు పరిశీలించిన :ఏపీ ఎం ఎస్ ఎం ఇ డైరెక్టర్ ముగడ రాజారావు



**విశాఖ తూర్పు,పెన్ పవర్, జూన్ 20:** తూర్పు నియోజకవర్గం 11వ వార్డు బాలాజీ నగర్ అంగన్వాడీ కేంద్రం ను 11వ వార్డు అధ్యక్షులు, ఏపీ ఎం ఎస్ ఎం ఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ముగడ రాజారావు. అంగన్వాడి సెంటర్ల పనితీరు, పిల్లలకు అందిస్తున్న భోజనపు నాణ్యతను, గర్భిణీ స్త్రీలకు బాలింతలకు అందజేస్తున్న వస్తువుల నాణ్యతను పరిశీలించారు. వంటగది పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పలు అంశాలను పిల్లలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆహార నాణ్యతను పరిశీలించారు. పిల్లలతో మాట్లాడి ఉదయం టిఫిన్,మధ్యాహ్నం భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు,సమస్య ఉంటే మా దృష్టికి తీసుకొని రావాలని సిబ్బందికి తెలిపారు,అంగన్వాడీ టీచర్ శ్రీదేవి, శానిటరీ అధికారులు శ్రీను,సచివాలయ సిబ్బంది, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## బొండ్రుగూడ గెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

- **గల్లంతైన వ్యక్తి కోసం నాటు పడవలతో గాలించి మృత దేహాన్ని వెలికి తీసిన వైనం.**
- **ముంచంగిపుట్టు సిహెచ్ సి లో పోస్టుమార్టం అనంతరం గ్రామంలో తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహణ.**
- **మృతుని కుటుంబాన్ని ఆర్థికంగా తోడ్పాటు అందించాలంటున్నా గ్రామస్తులు.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 20.** మండలంలో గల జోలపుట్టు పంచాయతీ, బొండ్రుగూడ గ్రామానికి చెందిన నరంజి అద్దు (45) అనే వ్యక్తి బొండ్రుగూడ గెడ్డ బలిఘాట్ వద్ద చేపలు వేటకు వెళ్లి శుక్రవారం గల్లంతైన విషయం తెలిసిందే. శుక్రవారం సాయంత్రం నుండి చీకటి పడే వరకు గ్రామస్తులు గాలింపు చర్యలు చేపట్టినప్పటికి గల్లంతైన అద్దు ఆచూకీ లభించలేదు. అయితే ఈ ఘటనను గూర్చి పోలీసు, రెవిన్యూ శాఖ అధికారుల ఆధ్వర్యంలో గ్రామస్తులు శనివారం ఉదయం నుంచి గాలింపు చర్యలు చేపట్టగా ఉదయం 11 గంటల సమయంలో గల్లంతైన అద్దు మృతదేహాన్ని వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ముంచంగిపుట్టు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో తరలించారు. వైద్యులు శవ పరీక్ష చేసిన అనంతరం కుటుంబ సభ్యులు అద్దు యొక్క పార్ధివదేహానీ గ్రామంలో తరలించి దహన సంస్కారాలు నిర్వహించారు. మృతుడు అద్దుకు ఓ కుమారుడు, ఒ కుమార్తె ఉంది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అద్దు మరణంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోగా, గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## అన్నదాతలకు శుభవార్త..

## రైతుల ఖాతాల్లో రూ.6.93 కోట్ల జమ

- **9,902 మంది రైతులకు రూ.6.93 కోట్ల ప్రయోజనం**
- **రింతాడ రైతు సేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ పథకం ఆవిష్కరణ కార్యక్రమం**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 20:** మండలంలోని రింతాడ రైతు సేవా కేంద్రంలో పీఎం కిసాన్ మరియు అన్నదాత సుఖీభవ పథకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి దాసరి గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని 9,902 మంది రైతులకు రూ.6.93 కోట్ల మేర ఆర్థిక సహాయం వారి వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో జమ చేయనున్నట్లు తెలిపారు. ఇందులో కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం కిసాన్ పథకం కింద రూ.2,000, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.5,000 కలిపి, ప్రతి అర్హత కలిగిన రైతుకు రూ.7,000 చొప్పున జమ చేయనున్నట్లు వివరించారు.రైతులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, భూపతి, గ్రామ వ్యవసాయ సహాయకులు సౌందర్య, సింహాచలం, సిబ్బంది మహేశ్వరితో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.

# మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**అరకులోయ పెన్ పవర్ జూన్20 :** అల్లూరి జిల్లా అరకులోయ మండలం పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మాడుగడ వ్యూ పాయింట్ వద్ద యోగా కార్యక్రమం అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ప్రకృతి ఒడిలో, ఆహ్లాదకరమైన వాతావరణం మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లాకలెక్టర్దినేషాంతి. టి, జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ ఐటిటి ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ,జిల్లా యంత్రాంగం, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద లతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి యోగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి, పాడేరు మాజీ శాసనసభ్యులుగిడ్డి ఈశ్వరి , వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరై ఉత్సాహంగా యోగాసనాలు వేశారు.

మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఎంతగానో దోహదపడుతుందని, ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని ఈ సందర్భంగా అధికారులు పిలుపునిచ్చారు.

సరిహద్దు ప్రాంతాల్లో సైతం యోగా పట్ల అవగాహన కల్పించేందుకు, పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు మాడగడ వ్యూ పాయింట్‌ను ఈ వేడుకకు వేదికగా ఎంపిక చేయడం గొప్ప విశేషం. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు యోగాను నిత్య జీవితంలో బాగం చేసుకోవాలని పిలుపునిస్తూ,

భారతీయ సంస్కృతి అందించిన అమూల్యమైన వరం యోగా అని, దీనిని కేవలం ఒక రోజు కార్యక్రమంగా కాకుండా ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలని అల్లూరి జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు.

ఆరోగ్యకరమైన జీవనశైలికి మార్గం, యోగా అనేది కేవలం ఒక శారీరక వ్యాయామం మాత్రమే కాదు. ఇది శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ప్రశాంతతను మరియు ఉత్తమ జీవనశైలిని ప్రసాదించే ఒక అద్భుత మార్గమని పేర్కొన్నారు.

మానసిక ఒత్తిడికి పరిష్కారం, ప్రస్తుత కాలంలో మారుతున్న జీవనశైలి వల్ల తలెత్తుతున్న తీవ్ర ఒత్తిడి, ఆందోళన ఇతర అనారోగ్య సమస్యలకు యోగా చక్కటి పరిష్కారం చూపుతుందని,ప్రతిరోజూ కొన్ని నిమిషాల పాటు యోగా సాధన చేయడం ద్వారా మానసిక స్థైర్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని, సంపూర్ణ ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చునని తెలిపారు.

ప్రకృతి ఒడిలో యోగా, ప్రకృతి సంపదకు నిలయమైన అల్లూరి జిల్లాలో ప్రకృతి, యోగా కలయికతో ప్రజలు సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చని ఆకాంక్షించారు. ఈ యోగ కార్యక్రమంలో

యువత, విద్యార్థుల పాత్రే కీలక మని దేశ ప్రగతికి, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యువతే ప్రధాన బలం. కాబట్టి విద్యార్థులు, యువత యోగా పట్ల ప్రత్యేక ఆసక్తిని పెంపొందించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ యోగా కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేసినప్రజా ప్రతినిధులకు జిల్లా ప్రజలకు, విద్యార్థులకు,అధికారులకు, సమన్వయకర్తలకు నిర్వాహకులు కలెక్టర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ యోగ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడి ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, పాడేరు మాజీ శాసనసభ్యురాలు గిడ్డీ ఈశ్వరి, ట్రైకర్ చైర్మన్ కె కృష్ణారావు, జీసీసీ డైరెక్టర్ బొర్ర నాగరాజు ఇతర ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదంలో మరణించిన కార్యకర్తకు 85వ వార్డులో 5 లక్షల ప్రమాద బీమా అందించిన టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



**కూర్మాన పాలెం : పెన్ పవర్, జూన్ 20:** అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న నిరంతరము ప్రజల ప్రక్షాన పోరాడుతున్న తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు ప్రమాదవశాత్తు మరణిస్తే వారికి 5 లక్షల రూపాయల బీమాను తెలుగుదేశం పార్టీ అందజేస్తున్నదని పల్లా శ్రీనివాసరావు అన్నారు. 85వ వార్డులో ప్రమాదవశాత్తు మరణించిన పినమడక గ్రామానికి చెందినటువంటి తెలుగుదేశం పార్టీ కార్యకర్త ఉరుకూటి బోయన్న భార్య కనకమహాలక్ష్మికి 85 వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి దశేంద్ర ఆధ్వర్యంలో ఈరోజు 5 లక్షల రూపాయలు బీమా చెక్కును అందజేశారు. దేశంలోనే కార్యకర్తలకు ప్రత్యేకమైన నిధులు ఏర్పాటు చేసిన ఘనత జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ,రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి జాతి వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర మంత్రి లోకేష్ బాబు కే చేందుతుందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గాజువాక సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు , వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, హాస్పిటల్ డైరెక్టర్ డొక్కా రమేష్ గారు, కమాండ్ గొల్లవిల్లి నూకరాజు, బంధం ధనాబాబు, యలమంచిలి శ్రీను, కొయ్య సింహాద్రి, ముచ్చు దయాకర్, అలమండ శ్రీను, ఛట్టి సోమి కుమారి,వార్డ్ మహిళా అధ్యక్షురాలు గీతా అన్నపూర్ణ, వార్డ్ ఐ టి డి పి జనరల్ సెక్రటరీ గోపిశెట్టి పద్మ, నియోజకవర్గ ఐటీడీపీ జనరల్ సెక్రటరీ జామీ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్ ఎస్ఎంఎస్-1 లో జరిగినటువంటి ప్రమాదంలో మరణించిన డొంకాడ గ్రామానికి చెందినటువంటి నక్కరాజు అప్పలరాజు దిన కార్యములో పాల్గొని ఘన నివాళులర్పించి ప్రగాఢమైన సానుభూతి సంతాపాన్ని తెలియజేసి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పిన రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు . ఈ సందర్భంగా మాట్లాడుతూ అతి త్వరలోనే స్టీల్ ప్లాంట్ యాజమాన్యంతో ప్రభుత్వంతో మాట్లాడి మరణించిన కుటుంబాలకు రావలసినవన్నీ కూడా వెంటనే పూర్తి చేస్తామని భరోసా ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ గాజువాక సమన్వయకర్త ప్రసాదల శ్రీనివాసరావు , 79 వ వార్డు మాజీ కార్పొరేటర్ రావు శ్రీనివాస్ , 85వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కర్రి దశేంద్రలిజనసేన అధ్యక్షుడు గవర సోమశేఖర్, వార్డు ప్రధాన కార్యదర్శి విందుల రాజు, హాస్పిటల్ డైరెక్టర్ డొక్కా రమేష్,కమాండో గొల్లవిల్లి నూకరాజు, దాసరి డాన్ శ్రీను, యల్లపు సాంబశివరావు, బంధం ధనా బాబు, అలమండ శ్రీను, గీతా అన్నపూర్ణ ,పద్మ, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత మనందరి బాధ్యత.



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 20 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండల కేంద్రంలో సిఐ విజయ్ కుమార్ ఆదేశాల మేరకు ఎస్సై దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో హుకుంపేట మండల కేంద్రంలో మహిళల భద్రత అనే అంశంపై విద్యార్థినీ విద్యార్థులతో.భారీ ర్యాలీని నిర్వహించారు.

మైనర్ వివాహాలు నిర్వహించకూడదని. అలా ఎక్కడైనా జరిగితే తమకు సమాచారం ఇవ్వాలని ఈ ర్యాలీలో తెలియజేశారు అలాగే మహిళలకు గృహ హింస ఈవ్ టీజింగ్. వంటివి చేయకూడదని హెచ్చరించారు. మహిళల పట్ల గౌరవం గా నడుచుకోవాలని అదే సమాజానికి గౌరవం అని అన్నారు. ఆడపిల్లలే మన కుటుంబాలు గౌరవం అంటూ నినాదాలు చేశారు అలాగే చెడు వ్యసనాలు కు దూరంగా ఉండాలని మరియు సంఘవిద్రోహ శక్తులకు చోటు కల్పించకూడదని. అలా చేస్తే చట్టం ఊరుకోదు అంటూ ఆయన విద్యార్థిని విద్యార్థులకు వివరించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది మరియు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

**గాజువాక పెన్ పవర్, జూన్ 20**



జీవీఎంసీ 66 వార్డులో కణితి రోడ్డు ఇందిరా కాలనీ అంగన్వాడీ కేంద్రాన్ని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గాజువాక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాస్ అకస్మాత్తుగా తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రంలో వంటశాల మరియు భోజన విషయంలో అన్ని వివరాలను అంగన్వాడీలో ఉన్న చిన్నారులను , లబ్ధిదారులకు అడిగి తెలుసుకున్నారు .పౌష్టికాహారం సక్రమంగా అందుతుందో లేదో అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీలో ఉన్న చిన్నారులతో అంగన్వాడీ టీచర్ ఏ విధంగా మెలుగుతున్నారో తెలుసుకోవడం జరిగినది దానితోపాటు అక్కడ ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి అంగన్వాడీలో ఉన్న పిల్లల గురించి నూతనంగా కట్టిన బాత్రూంలను పరిశీలించారు. కార్యక్రమంలో 66 వార్డు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ , వార్డు అధ్యక్షుడు గోమాడ వాసు ,జనసేన వార్డు అధ్యక్షుడు పాలరౌతూ వెంకటరమణ ,వార్డు కార్యదర్శి ఎండి ముర్తాజా విశాఖ మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ స్వర్ణపుడి రాంబాయి, క్లస్టర్ ఇంచార్జ్ గూడెపు సత్యనారాయణ, వార్డు మైనార్టీ నాయకుడు అన్సర్ వల్లి, సరోజినీలత ,కూటమి నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

## గిరిజన ఆశ్రమ పాఠశాల సిఆర్టి లను రెన్యువల్ చేయాలి.


- **గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సి.ఆర్.టి.లను తక్షణమే రెన్యూవల్ చేయాలి - ట్రైబల్ రైట్స్ ఫోరం (టిఆర్ఎస్) డిమాండ్**



**గుమ్మలక్ష్మీపురం జూన్ 20 పెన్ పవర్.** పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ రెసిడెన్షియల్ టీచర్లను ( సి ఆర్ టి ) వెంటనే రెన్యూవల్ చేసి,గిరిజన విద్యార్థుల విద్యకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని ట్రైబల్ రైట్స్ ఫోరం జిల్లా అధ్యక్షులు ఇంటికుప్పల రామకృష్ణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సి.ఆర్.టి.ల రెన్యూవల్ ప్రక్రియలో జాప్యం జరుగుతోందని,దీనివల్ల పాఠశాలల్లో బోధన కార్యక్రమాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.గిరిజన ప్రాంతాల్లో ఇప్పటికే ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని ఉన్న సి.ఆర్.టి లను కూడా కొనసాగించకపోతే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకమవుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి సి.ఆర్.టి ల రెన్యూవల్ ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని,గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## చురుగ్గా కొనసాగుతున్న నరసింహస్వామి ఆలయ నిర్మాణ పనులు

- **ఆలయ నిర్మాణ పనులు పరిశీలించిన స్థానిక ఎస్సై నాని, వైసిపి జిల్లా నేత జెవివిఎన్ మూర్తి.**



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, జూన్ 20.** మండల కేంద్రంలోని రామాలయం సమీప కొండపైన నిర్మిస్తున్న సింహాచలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ పనులు అత్యంత చురుగ్గా సాగుతున్నాయి. శనివారం ఆలయ నిర్మాణ స్థలాన్ని స్థానిక ఎస్సైపి నాని, వైఎస్సార్సీపీ యువజన విభాగం జిల్లా నేత జె.వి.వి.ఎన్. మూర్తి మరియు ఆలయ కమిటీ స్వాములు సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. ముఖ్యంగా కొండపై ఆలయం నిర్మిస్తున్న ప్రదేశం వరకు వేగంగా జరుగుతున్న రోడ్డు పనులను వారు దగ్గరుండి చూశారు. జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రత్యేక చొరవతో, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆధ్వర్యంలో ఈ ప్రతిష్టాత్మక ఆలయ నిర్మాణం జరుగుతోంది. ఈ ఆలయ భవన నిర్మాణానికి గాను టీటీడీ ఎండోమెంట్ విభాగం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేసింది. లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు భక్తులు సైతం తమ వంతు ఆర్థిక, వస్తు సహాయాన్ని అందించి సహకరించాలని నిర్మాణ కమిటీ కోరింది. ఈ కార్యక్రమంలో స్వాములు దొన్ను, దొన్ను సీతారాం మరియు పలువురు భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

# రైతుల సంక్షేమామే కూటమి ప్రభుత్వం లక్ష్యం.



**అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ నిధులు విడుదల కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్.**

**గుమ్మలక్ష్మీపురం జూన్ 20 పెన్ పవర్.** కురుపాం నియోజకవర్గ కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో శనివారం నాడు నిర్వహించిన అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం నిధుల విడుదల కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం,వ్యవసాయాభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. అన్నదాత సుఖీభవ -- పీఎం కిసాన్ పథకం 2026-27 రెండో ఏడాది తొలి విడత నిధులు మరియు పీఎం కిసాన్ 23వ విడత నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా జమ చేయడం జరిగిందని తెలిపారు.పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పీఎం కిసాన్ నిధులను విడుదల చేయగా,పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నిర్వహించిన సభలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నదాత సుఖీభవ నిధులను విడుదల చేశారని వివరించారు.రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 2026-27 ఆర్థిక సంవత్సరానికి తొలి విడతగా ప్రతి అర్హ రైతు కుటుంబానికి రూ.7,000 చొప్పున అందజేయడం జరిగిందని తెలిపారు.ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000, కేంద్ర ప్రభుత్వం రూ.2,000 చొప్పున అందించాయని పేర్కొన్నారు.రైతులకు ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నిధులను నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు.అదేవిధంగా కురుపాం నియోజకవర్గ పరిధిలోని 39,084 మంది రైతు కుటుంబాలకు మొత్తం రూ.26.82 కోట్ల (రూ.26,82,00,000) ఆర్థిక సహాయాన్ని నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరిగిందని ఎమ్మెల్యే తెలిపారు.ఈ నిధులు రైతులకు సాగు ఖర్చుల భారం తగ్గించి,వ్యవసాయ కార్యకలాపాలకు మరింత తోడ్పాటును అందిస్తాయని పేర్కొన్నారు.వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు,రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో ఉమ్మడి విజయనగరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డొంకాడ రామకృష్ణ,అరకు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి దత్తి లక్ష్మణరావు,కురుపాం ఏఎంసి చైర్ పర్సన్ కడ్రక కళావతి,రాష్ట్ర కార్యదర్శి బొంగు సురేష్,గరుగుబిల్లి ఎంపీపీ ఉరిటి రామారావు,రాష్ట్ర డైరెక్టర్స్ అక్కేన మధుసూదన్ రావు,అంబటి రాంబాబు,పువ్వల లావణ్య,మండల కన్వీనర్లు కొండయ్య,నారాయణ, భుంజగరావు,వ్యవసాయ శాఖ అధికారులు,ప్రజాప్రతినిధులు,కూటమి నాయకులు,రైతులు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## చింతపల్లి గిరిజన సహకార సంస్థ డి.ఎం. డి. సింహాచలం బదిలీ.



**చింతపల్లి పెన్ పవర్ జూన్ 20.**
చింతపల్లి గిరిజన సహకార సంస్థ( జిసిసి ) డివిజనల్ మేనేజర్ డి సింహాచలంకు చింతూరు డివిజన్ కు బదిలీ అయింది. ఈయన చింతపల్లి డిఎంగా ఆరు నెలల క్రిందటే విధుల్లో చేరారు. ప్రస్తుతం సంస్థలో సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను చింతూరు డివిజన్ కు బదిలీ చేస్తూ గిరిజన సహకార సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన స్థానంలో కొయ్యూరు జిసిసి బ్రాంచ్ మేనేజర్ గా విధులు నిర్వహిస్తున్న సర మండ విజయ్ కుమారును చింతపల్లి డిఎం గా పదోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. పదోన్నతి పొందిన విజయ్ కుమార్ విధుల్లో చేరాల్సి ఉంది.

## రవాణా శాఖ కార్యాలయం వద్ద యోగ కార్యక్రమం.



**హుకుంపేట పెన్ పవర్ జూన్ 20 :** అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలంలో గల రవాణా శాఖ కార్యాలయంలో శనివారం నాడు డ్రైవర్లతో యోగ కార్యక్రమం నిర్వహించారు. యోగాతో ప్రశాంతత మరియు అనేక రకమైన ఆరోగ్య సమస్యలను కూడా ఎదుర్కోవచ్చని రవాణా శాఖ అధికారులు తెలియజేశారు అంతేకాకుండా ప్రతిరోజు యోగా చేస్తే.మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని ఆయన అన్నారు. అనంతరం డ్రైవర్లతో మాట్లాడి వారి కష్టసుఖాలను తెలుసుకున్నారు. అలాగే అధికలోడుతో వాహనాల నడపొద్దని తద్వారా జరిగే అనర్ధాలను వారికి వివరించారు. అలాగే బండి కాగితాలన్నీ సరిచూసుకోవాలని సూచించారు మద్యం తాగి వాహనాలు నడపరాదని అలా చేస్తే వాహనాన్ని సీజ్ చేస్తామని లైసెన్సులు రద్దు చేస్తామని తీవ్రంగా హెచ్చరించారు జూన్ ఒకటో తారీఖున అందరి ఆటో డ్రైవర్ల యూనియన్లతో మీటింగ్ ఉంటుందని ఆయన అన్నారు ఆ రోజున ఖచ్చితంగా డ్రైవర్లు మరియు ఓనర్లు అందరూ హాజరు కావాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో హుకుంపేట మండలం ఆటో డ్రైవర్లు మరియు రవాణా శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


## 1/70 చట్టం రద్దయితే ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల మనుగడకే ప్రమాదం

- **గిరిజనేతరుల పిటిషన్‌ను సుప్రీంకోర్టు వెంటనే కొట్టివేయాలి**
- **ఆల్ ఇండియా ఆదివాసి స్వయంపాలన సాధన సమితి ఉపాధ్యక్షుడు మడపల సోమేష్ కుమార్**



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 20:** ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనుల భూములను రక్షించే 1/70 భూ బదలాయింపు నియంత్రణ చట్టాన్ని రద్దు చేయాలని గిరిజనేతరులు సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని ఆల్ ఇండియా ఆదివాసి స్వయం పాలన సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు మడపల సోమేష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1/70 చట్టం అనేది ఏజెన్సీ ప్రాంతాల్లో నివసించే లక్షలాది మంది గిరిజనుల జీవనాధారాన్ని, భూమి హక్కులను కాపాడేందుకు రూపొందించబడిన కీలకమైన చట్టమని పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్, ఆర్టికల్ 244(1) ప్రకారం ఈ చట్టం అమలులోకి వచ్చిందని, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనుల భూములు గిరిజనేతరులకు అమ్మడం, బదలాయించడం చట్టవిరుద్ధమని స్పష్టం చేస్తుందని తెలిపారు. 1/70 చట్టం రద్దు అయితే అల్లూరి సీతారామరాజు జిల్లా వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులు తమ భూములను కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. రియల్ ఎస్టేట్, మైనింగ్, పర్యాటక రంగాల పేరుతో బాహ్య ప్రాంతాల పెట్టుబడిదారులు గిరిజన భూములను ఆక్రమించే అవకాశం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫలితంగా ఆదివాసీలు తమ సొంత భూముల్లోనే కూలీలుగా మారే పరిస్థితి ఏర్పడుతుందని అన్నారు.భూమి, అడవి, కొండలు, వాగులు ఆదివాసీ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, భాషలతో విడదీయరాని సంబంధం కలిగి ఉన్నాయని, భూమి కోల్పోతే గిరిజనుల అస్తిత్వమే ప్రమాదంలో పడుతుందని పేర్కొన్నారు. భూములు కోల్పోయిన గిరిజన కుటుంబాలు ఉపాధి కోసం పట్టణాలకు వలస వెళ్లాల్సి వస్తుందని, దారిద్ర్యం పెరిగి పిల్లల విద్య, మహిళల భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. అలాగే, 1997లో సుప్రీంకోర్టు ఇచ్చిన సమతా కేసు తీర్పులో షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజనేతరులకు భూముల బదలాయింపు చెల్లదని స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని గుర్తు చేశారు. 1/70 చట్టాన్ని రద్దు చేయడం అంటే రాజ్యాంగ స్ఫూర్తిని, సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించినట్లేనని అభిప్రాయపడ్డారు.ఈ నేపథ్యంలో గిరిజనేతరులు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు వెంటనే కొట్టివేయాలని, 1/70 చట్టం రాజ్యాంగబద్ధమైనదని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కేసులో గిరిజనుల తరఫున బలమైన వాదనలు వినిపించాలని కోరారు. అలాగే 1/70 చట్టంతో పాటు పేసా చట్టం-1996ను క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు చేయాలని, బినామీ పేర్లతో గిరిజనేతరులు ఆక్రమించిన భూములను స్వాధీనం చేసుకుని నిజమైన గిరిజన రైతులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టం తమ జీవనాడి అని, దానిని బలహీనపరిచే లేదా రద్దు చేసే ప్రయత్నాలు జరిగితే అల్లూరి సీతారామరాజు జిల్లా గిరిజనులంతా ఏకమై చట్టబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా పోరాటం చేస్తారని మడపల సోమేష్ కుమార్ హెచ్చరించారు. ఈ పోరాటంలో అన్ని గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, న్యాయవాదులు, మేధావులు తమకు అండగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గోలుగొండలో అన్నదాత సుఖీభవ -పాల్గొన్న చింతకాయల రాజేష్



**గొలుగొండ, పెన్ పవర్ (జూన్ 20) :** గొలుగొండ మండల కార్యాలయంలో శనివారం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ తనయుడు, యువనేత చింతకాయల రాజేష్, కూటమి నేతలు మరియు మండల నాయకులతో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆధునిక వ్యవసాయ పరికరాల స్టాల్స్‌ను పరిశీలించారు. అనంతరం చింతకాయల రాజేష్ తదితర నాయకుల చేతుల మీదుగా రైతులకు ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతు కుటుంబానికి ఏటా కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలకు రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.14 వేలు జతచేసి మొత్తం రూ.20,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమాన్ని పల్నాడు జిల్లా చిలకలూరిపేట నియోజకవర్గం నుంచి ముఖ్యమంత్రి ప్రారంభించారని ఆయన గుర్తుచేశారు. ఇందులో భాగంగా ఈరోజు 2026-27 సంవత్సరానికి గానూ మొదటి విడతగా రూ.7,000 (అన్నదాత సుఖీభవ కింద రూ.5,000, పీఎం కిసాన్ కింద రూ.2,000) చొప్పున నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు వివరించారు. ఈ మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 46,85,838 మంది రైతులకు నిధులు విడుదల చేయగా, అనకాపల్లి జిల్లాలో 2,42,536 రైతు కుటుంబాలకు రూ.158 కోట్ల 4 లక్షలు మంజూరు అయ్యాయన్నారు. నర్సీపట్నం నియోజకవర్గంలో మొత్తం 35,147 మంది రైతులకు రూ.23 కోట్ల 14 లక్షలు ఈరోజు విడుదలవుతుండగా, అందులో గోలుగొండ మండలంలోని 7,142 మంది రైతులకు రూ.4.76 కోట్లు పెట్టుబడి సాయంగా అందుతున్నాయని పేర్కొన్నారు. గత 2025-26 సంవత్సరంలో కూడా నర్సీపట్నం నియోజకవర్గంలోని ఇదే 35,147 మంది రైతు కుటుంబాలకు మూడు విడతల్లో కలిపి మొత్తం రూ.66 కోట్ల 32 లక్షల రూపాయలు విడుదల చేసినట్లు ఆయన వివరించారు.
?అనంతరం అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం కేడీ పేట గ్రామ రైతుల సమస్యపై చింతకాయల రాజేష్ ప్రత్యేకంగా స్పందించారు. గత 70 సంవత్సరాలుగా అక్కడ వివిధ గ్రామాల్లో భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ఎటువంటి డాక్యుమెంట్లు లేవని, వారు కేవలం సాగుదారులు మాత్రమే కావడంతో ప్రభుత్వం యూరియా సప్లై చేసే అవకాశం ఇవ్వలేదన్న విషయాన్ని ప్రస్తావించారు. దీనిపై తక్షణమే స్పందించి కేడీ పేటలో ఉన్న రైతుల లిస్టులు తయారు చేసి అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్‌కు అందజేస్తామని, తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. సాగుదారులైన రైతులకు యూరియా అందేలా తాను అప్పన్నతో పాటు జిల్లా కలెక్టర్ గారితో స్వయంగా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని రాజేష్ భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ రాజన్న సూర్యచంద్ర, బీజేపీ రాష్ట్ర కన్వీనర్ గాదె శ్రీనివాసరావు, జడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, గొలుగొండ మండలం టిడిపి మండల అధ్యక్షుడు తారక వేణు గోపాల్, సాంబమూర్తి, వివిధ శాఖల అధికారులు, మండల నాయకులు మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రిష్టి వరల్డ్ స్కూల్‌లో ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు



**కూర్మన్నపాలెం: పెన్ పవర్, జూన్ 21:** ఉక్కునగరంలోని శ్రిష్టి వరల్డ్ స్కూల్ ఆవరణలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు , తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని యోగా సాధన చేశారు.అర్హత కలిగిన యోగా శిక్షకుని మార్గదర్శకత్వంలో పాల్గొన్న వారు వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలు మరియు శ్వాస వ్యాయామాలను అభ్యసించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత మరియు భావోద్వేగ సమతుల్యత సాధ్యమవుతుందని వివరించారు. విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా యోగా సాధన చేసి, తమ రోజువారీ జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని ప్రతిజ్ఞ చేశారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, యోగా భారతదేశపు ప్రాచీన సంప్రదాయానికి చెందిన అమూల్యమైన కానుక అని, ఆరోగ్యవంతమైన మరియు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.
కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రిక, ఎగ్జిక్యూటివ్ ప్రిన్సిపాల్ కిరణ్ , అవుట్‌రీచ్ హెడ్ రాధా శ్రీనివాస్ పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులను యోగాను జీవితాంతం ఆచరించాలని ప్రోత్సహించారు.ఆరోగ్యం, సామరస్యం మరియు సంపూర్ణ శ్రేయస్సును పెంపొందించేందుకు నిత్యం యోగా సాధన చేయాలని అందరూ సామూహికంగా ప్రతిజ్ఞ చేయడంతో కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

## స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో విస్తృత పారిశుధ్య చర్యలు

**దుకాణదారులకు అవగాహన.. రోడ్లపై చెత్త వేయొద్దని హెచ్చరిక**




**గూడెంకొత్తవీధి,పెన్ పవర్,జూన్ 20:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గూడెంకొత్తవీధి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం విస్తృత పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు.ఈ సందర్భంగా గూడెం సెంటర్ నుంచి కొత్తవీధి వరకు రహదారి ఇరువైపులా పేరుకుపోయిన చెత్తను తొలగించడంతో పాటు తుప్పలు, ముళ్ల పొదలను కూడా తొలగించారు. గ్రామ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.అలాగే గూడెం సెంటర్‌లోని దుకాణాల యజమానులకు నోటీసులు జారీ చేసి, రహదారులపై చెత్త వేయరాదని సూచించారు. తడి చెత్తను ప్రత్యేక బకెట్లలో సేకరించి క్లాప్ మిత్రకు అందజేయాలని, పొడి చెత్తను స్వచ్ఛ రథం ద్వారా విక్రయించాలని అవగాహన కల్పించారు.గూడెం సెంటర్‌లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తూ వాహనదారులకు ఇబ్బందులు కలిగించడమే కాకుండా, ప్రమాదాలకు కూడా కారణమవుతున్నాయని అధికారులు తెలిపారు. ఈ నేపథ్యంలో మైక్ ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేసి, పశువుల యజమానులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రీమల రాజేశ్వరి,డిప్యూటీ ఎంపీడీఓ రవికాంత్ పంచాయితీ అభివృద్ధి అధికారి పంద్రపాల్, పేసా సభ్యుడు ముక్కలి గిరి, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు సాయి పవన్, లక్ష్మణ్, స్వచ్ఛ రథం ఆపరేటర్ రీమల పొలు, ఏఎన్ఎంలు, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.గ్రామాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని, స్వచ్ఛతను జీవన విధానంగా మార్చుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు.

# 2027 వరల్డ్ కప్ కోసం కొత్త స్కెచ్.. కేఎల్ రాహుల్‌ను పక్కన పెట్టిన భారత్!



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నైలోని చేపాక్ స్టేడియంలో భారత్ వర్సెస్ ఆఫ్ఘనిస్థాన్ మధ్య జరుగుతున్న మూడో వన్డేలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్థాన్ మొదట బ్యాటింగ్ తీసుకోగా, టీమిండియా చెపాక్ పిచ్‌పై టార్గెట్‌ను ఛేజ్ చేయడానికి రెడీ అయింది. అయితే, మ్యాచ్ స్టార్ట్ అవ్వగానే భారత ఫ్యాన్స్ అందరినీ ఒకే ప్రశ్న వేధించింది.. ప్లేయింగ్ ఎలెవెన్‌లో కేఎల్ రాహుల్ ఎందుకు లేదని.

**కేఎల్ రాహుల్ ఎందుకు ఆడట్లేదంటే?:**

ఫామ్‌లో ఉన్నప్పటికీ కేఎల్ రాహుల్‌ను ఈ మ్యాచ్ తుది జట్టు నుంచి తప్పించారు. దీనికి కారణం జట్టు కాంబినేషన్, ఆల్ రౌండర్ నితీష్ కుమార్ రెడ్డి టీమ్‌లోకి తిరిగి రావడం కోసమే.. సిరీస్ ఆల్రెడీ 2--0తో ఇండియా గెలవడంతో.. బెంచ్ స్ట్రెంత్‌ను పరీక్షించేందుకు టీమ్ మేనేజ్‌మెంట్ రాహుల్‌కు రెస్ట్ ఇచ్చి, ఆల్ రౌండ్ ఆప్షన్ కోసం మన తెలుగు కుర్రాడు నితీష్ రెడ్డిని తుది జట్టులోకి తీసుకుంది. కేఎల్ రాహుల్‌తో పాటు జట్టులో మొత్తం మూడు మార్పులు చేసింది. ప్రసిద్ధ్ కృష్ణ, హర్ష్ దూబే, నితీష్ రెడ్డిలు టీమ్‌లోకి వచ్చారు.

**గిల్ మైండ్ గేమ్:**

భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. పిచ్ చాలా బాగుంది, ఒకవేళ మేము టాస్ గెలిచినా మొదట బ్యాటింగే తీసుకునే వాళ్లం.. గత మ్యాచ్ లాగే ఇక్కడ కూడా ఎండ చాలా ఎక్కువగా ఉంది. కానీ, ఈ మ్యాచ్‌లో మేము మొదట ఫీల్డింగ్ చేయాల్సి రావడం ఒక రకంగా మంచిదే. ఎందుకంటే, పెద్ద స్కోర్లను ఈజీగా, కన్‌సిస్టెంట్‌గా ఛేజ్ చేయడం అనే ఒక ఏరియాలో మేము ఇంకా పర్‌ఫెక్ట్ అవ్వలేదన్నాడు. ఈరోజు మా ఛేజింగ్ గేమ్ ఎలా ఉందో చూసేందుకు ఇదొక సూపర్ ఛాన్స్ అని గిల్ పేర్కొన్నాడు.

# జైస్వాల్ జోరు, రోహిత్ రచ్చ.. ఆఫ్ఘన్‌పై భారత్ ఘన విజయం.. 3-0తో సిరీస్ కైవసం!



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నైలోని ఎంఏ చిదంబరం (చెపాక్) స్టేడియం వేదికగా జరిగిన మూడో వన్డేలో భారత జట్టు అన్‌స్టాపబుల్ పర్ఫామెన్స్‌తో రచ్చ లేపింది. ఆఫ్ఘన్ నిర్దేశించిన 219 పరుగుల టార్గెట్‌ను ఇండియన్ బ్యాటర్లు ఆడుతూ పాడుతూ కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఊదేశారు. ఈ ఘన విజయంతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌ను భారత్ 3--0తో క్లీన్ స్వీప్ చేసి ట్రోఫీని తన ఖాతాలో వేసుకుంది.

**షాహిదీ సెంచరీతో పోరాడిన ఆఫ్ఘన్:**

ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ తీసుకున్న ఆఫ్ఘనిస్థాన్‌కు భారత పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ (5 వికెట్లు) పవర్ ప్లేలోనే చుక్కలు చూపించాడు. కేవలం 36 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి తీవ్ర కష్టాల్లో పడ్డ ఆఫ్ఘన్ జట్టును ఆ జట్టు కెప్టెన్ హష్మతుల్లా షాహిదీ ఒంటరి పోరాటంతో ఆదుకున్నాడు. అద్భుతమైన క్లాస్ ఇన్నింగ్స్ ఆడిన షాహిదీ వన్డేల్లో తన మొట్టమొదటి సెంచరీ (102 పరుగులు) నమోదు చేయగా, ఆల్ రౌండర్ అజ్మతుల్లా ఒమర్జాయ్ (50) అతనికి సూపర్ సపోర్ట్ ఇచ్చాడు. దీంతో ఆఫ్ఘనిస్థాన్ 44.2 ఓవర్లలో 218 పరుగులకు ఆలౌట్ అయింది.

**రోహిత్-జైస్వాల్ రుద్రరూపం:**

219 పరుగుల లక్ష్య ఛేదనకు దిగిన టీమిండియాకు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, రోహిత్ శర్మలు బుల్లెట్ లాంటి స్టార్ట్ ఇచ్చారు. ఆఫ్ఘన్ బౌలర్లకు ఏమాత్రం ఛాన్స్ ఇవ్వకుండా బౌండరీల వర్షం కురిపించారు. ఇద్దరూ పోటీ పడుతూ హాఫ్ సెంచరీలు పూర్తి చేసుకున్నాక మరింత రెచ్చిపోయారు. ఈ క్రమంలోనే మొదటి వికెట్‌కు ఏకంగా 170 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను వన్ సైడ్ చేసేశారు.

# మెస్సీకి రెడ్ కార్డ్ ఇవ్వాల్సిందే.. అర్జెంటీనాపై అల్జీరియా కంప్లైంట్.. రంగంలోకి ఫిఫా?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫిఫా ప్రపంచకప్ 2026 మెగా టోర్నీలో అర్జెంటీనా కెప్టెన్, ఫుట్‌బాల్ లెజెండ్ లియోనెల్ మెస్సీ హాట్రిక్ గోల్స్‌తో (3-0 తేడాతో అల్జీరియాపై విజయం) అదిరిపోయే స్టార్ట్ అయితే ఇచ్చాడు కానీ.. మ్యాచ్ ముగిశాక అసలైన లొల్లి మొదలైంది. ఈ మ్యాచ్‌లో రెఫరీ తీసుకున్న కొన్ని వివాదాస్పద నిర్ణయాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ అల్జీరియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమైక్య కు అధికారికంగా కంప్లైంట్ చేసింది. ముఖ్యంగా మెస్సీ చేసిన ఒక ఫౌల్‌కు రెడ్ కార్డ్ ఇవ్వాల్సిందేనని అల్జీరియా పట్టుబడుతోంది.

**కాలితో తన్నిన మెస్సీ.. రెఫరీ సైలెంట్:**

మ్యాచ్ ఫస్ట్ హాఫ్‌లో అర్జెంటీనా 1--0తో ముందంజలో ఉన్న సమయంలో ఈ వివాదాస్పద ఘటన చోటు చేసుకుంది. బంతి కోసం పోటీ పడుతున్న క్రమంలో మెస్సీ తన బూటును పైకెత్తి అల్జీరియా కెప్టెన్ ఐస్సా మాండి పిక్కపై వెనుక నుంచి బలంగా తన్నాడు. అల్జీరియా ప్లేయర్లు దీనిపై గట్టిగా అప్పీల్ చేసినప్పటికీ, ఆన్-ఫీల్డ్ రెఫరీ కనీసం ఫౌల్ కూడా ఇవ్వలేదు.. అటు వీడియో అసిస్టెంట్ రెఫరీ కూడా దీనిని రివ్యూ చేయలేదు.

అల్జీరియా ఫుట్‌బాల్ ప్రతినిధి మాట్లాడుతూ.. మా కంప్లైంట్ ముఖ్యంగా మెస్సీ చేసిన ఆ ప్రమాదకరమైన ఫౌల్ గురించే.. దానికి ఖచ్చితంగా డైరెక్ట్ రెడ్ కార్డ్ ఇవ్వాలి.. అర్జెంటీనా మాకంటే బాగా ఆడిందనే విషయాన్ని మేము ఒప్పుకుంటాం, కానీ ఇలాంటి తప్పుడు నిర్ణయాలు తీసుకున్నప్పుడు మేము సైలెంట్‌గా ఉండలేం.. మ్యాచ్‌లో ఇలాంటివి 3 సంఘటనలు జరిగాయి, దేనికీ VAR స్పందించలేదని ఆరోపించారు. అంతేకాదు, సెకండ్ హాఫ్‌లో అర్జెంటీనా మిడ్‌ఫీల్డర్ అలెక్సిస్ మెక్ అలిస్టర్.. గాల్లోకి లేచి బంతిని హెడ్ చేసే క్రమంలో అల్జీరియా ప్లేయర్ ఇబ్రహీం మాజాను మోచేత్తో కొట్టాడని, దానికి కూడా రెఫరీ ఫౌల్ ఇవ్వలేదని అల్జీరియా పేర్కొంది.

**మెస్సీకి ఒక రూల్.. మాకో రూలా?:**

మెస్సీకి రెడ్ కార్డ్ ఇవ్వకపోవడంపై సోషల్ మీడియాలో ఫ్యాన్స్, ఎక్స్‌పర్ట్స్ మధ్య పెద్ద యుద్ధమే నడుస్తోంది. దీనిపై సౌతాఫ్రికా హెడ్ కోచ్ హ్యూగో బ్రూస్ తీవ్రంగా విమర్శించారు. దాదాపు ఇలాంటి ఫౌల్ చేసినందుకే దక్షిణాఫ్రికా జట్టు మిడ్‌ఫీల్డర్ థెంబ జ్వానేపై ఫిఫా మూడు మ్యాచ్‌ల నిషేధం విధించింది. మరీ మెస్సీ విషయంలో జరిగిన దాన్ని చూశాక, మా ప్లేయర్‌కు ఇచ్చిన శిక్షను నేను అస్సలు ఒప్పుకోను.. మెస్సీ లాంటి క్వాలిటీ ప్లేయర్లు గ్రౌండ్‌లోనే ఉండాలి, అందులో డౌట్ లేదు.. కానీ ఒకే రకమైన తప్పుకు ఇద్దరు ప్లేయర్ల మధ్య రెఫరీలు ఇంత వ్యత్యాసం ఎలా చూపిస్తారో నాకు అర్థం కావడం లేదన్నారు.

**టాలీవుడ్‌లో నాగదుర్గకు భారీ అవకాశం**



# యష్ 'టాక్సిక్'.. ఆ విషయంలో ఫెయిల్ అయ్యారా?



—కింగ్ స్టార్ యష్ పేరు వినగానే ప్రేక్షకులకు ముందుగా గుర్తుకు వచ్చేది కేజీఎఫ్ సిరీస్. ఆ సినిమాలతో ఆయన పాన్ ఇండియా స్టార్ గా క్రేజ్ సొంతం చేసుకున్నారు. అందుకే ఆయన నుంచి వచ్చే ప్రతి కొత్త ప్రాజెక్టుపై భారీ అంచనాలు ఉంటాయి. ప్రస్తుతం యష్ హీరోగా తెరకెక్కుతున్న టాక్సిక్ కూడా అలాంటి అంచనాల మధ్య రూపుదిద్దుకుంటోంది. అయితే సినిమా రిలీజ్ డేట్ పై క్లారిటీ లేనప్పటికీ, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఆసక్తికర చర్చ నడుస్తోంది.

గీతూ మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న టాక్సిక్ ను కేవీఎన్ ప్రొడక్షన్స్ భారీ స్థాయిలో నిర్మిస్తోంది. యష్ సరసన రుక్మిణి వసంత్, తారా సుతారియా యాక్ట్ చేస్తున్నారు. అలాగే హ్యూమా ఖురేషి, కియారా అద్వానీ, నయనతార వంటి స్టార్ బ్యూటీలు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారీ బడ్జెట్, స్టార్ క్యాస్ట్, ఇంటర్నేషనల్ రేంజ్ ప్రొడక్షన్ వాల్యూస్ తో ఆ సినిమా మొదటి నుంచే హాట్ టాపిక్ గా మారింది. సినిమా ప్రకటించిన సమయంలో వచ్చిన పోస్టర్లు, కాన్సెప్ట్ వివరాలు అభిమానుల్లో మంచి ఆసక్తిని పెంచాయి. ముఖ్యంగా కేజీఎఫ్ తర్వాత యష్ ఎలాంటి కథను ఎంచుకున్నారనే విషయంపై నేషనల్ వైడ్ గా చర్చ జరిగింది. దీంతో టాక్సిక్ పై మొదటి నుంచే మంచి బజ్ ఏర్పడింది. అయితే ఆ బజ్ ను మేకర్స్ ఎక్కువ కాలం కొనసాగించలేకపోయారనే అభిప్రాయం ఇప్పుడు కొందరిలో వ్యక్తమవుతోంది.సాధారణంగా భారీ పాన్ ఇండియా సినిమాలకు సంబంధించి తరచూ అప్డేట్లు, పోస్టర్లు, వీడియోలు లేదా షూటింగ్ విశేషాలు విడుదల చేస్తుంటారు. దీంతో సినిమా ప్రేక్షకుల దృష్టిలో కంటిన్యూగా ఉంటుంది. కానీ టాక్సిక్ విషయంలో అలాంటి ప్రమోషనల్ యాక్టివిటీ తక్కువగా కనిపించిందనే అభిప్రాయం సోషల్ మీడియాలో వినిపిస్తోంది. సినిమా గురించి కొత్త సమాచారం లేకపోవడం, విడుదల తేదీపై కూడా స్పష్టత లేకపోవడం వల్ల మొదట్లో ఉన్న హైప్ కొంత తగ్గిందని కొందరు నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.ముఖ్యంగా సోషల్ మీడియా యుగంలో ప్రేక్షకుల దృష్టిని నిలబెట్టుకోవడం చాలా కీలకంగా మారింది. వరుస అప్డేట్స్ లేకపోతే ఎంత పెద్ద స్టార్ సినిమా అయినా చర్చల నుంచి కొంతకాలం దూరమవుతుందని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదే ఇప్పుడు టాక్సిక్ విషయంలో జరిగిందని కొందరు సినీ ప్రియులు చెబుతున్నారు. అయితే మరికొందరు మాత్రం ఆ వాదనతో ఎగ్రీ అవ్వడం లేదు.పెద్ద సినిమాల విషయంలో మేకర్స్ కొన్నిసార్లు కావాలనే సైలెంట్ స్ట్రాటజీ ఫాలో అవుతారని వారు గుర్తు చేస్తున్నారు. సరైన సమయంలో టీజర్, ట్రైలర్ లేదా గ్లింప్స్ విడుదల చేస్తే మళ్లీ సినిమా ఒక్కసారిగా వార్తల్లోకి వస్తుందని అంటున్నారు. యష్ కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఒక్క అప్డేట్ వచ్చినా సినిమా మళ్లీ ట్రెండింగ్ లోకి వెళ్లే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.ఏదేమైనా యష్ అభిమానులు కూడా సినిమా నుంచి కొత్త అప్డేట్ల కోసం ఎదురుచూస్తున్నారు. దీంతో రానున్న రోజుల్లో మేకర్స్ ప్రమోషన్ల స్పీడ్ పెంచుతారా? ప్రస్తుతం తగ్గినట్లు కనిపిస్తున్న బజ్ మళ్లీ పీక్ రేంజ్ కు తీసుకెళ్తారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అలా టాక్సిక్ పై ఆసక్తి తగ్గలేదుగానీ, ఆ బజ్ ను కొనసాగించే విషయంలో మేకర్స్ మరింత జోష్ గా వ్యవహరించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం మాత్రం వినిపిస్తోంది.



**ఆయిషా శర్మ: ఆకర్షణీయమైన సొగసు మరియు పెరుగుతున్న స్టార్ ఇమేజ్**

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965